పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 | సంచిక : 309 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | సోమవారం 14 జూలై 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

బోనాల సంబరం..

ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయానికి విచ్చేసిన రేవంత్ రెడ్డి
- ఇతర మంత్రులు కూడా ఈ వేడుకలో పాల్గొన్న వైనం
- ప్రత్యేక పూజలు చేసిన సీఎం, మంత్రులు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం నాడు సికింద్రాబా ద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి లష్కర్ బోనాల సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పలువురు కేబినెట్ సహచరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సాంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వివరాలు 2లో..

తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయాలి... అరెస్ట్ చేయాలి

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కవిత సంబరాలు
- కవితకేంటి సంబంధం అంటూ తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు
- డీజీపీకి, శాసనమండలి చైర్మన్ కు కవిత ఫిర్యాదు

హైదరాబాద్ పెన్ పవర్:తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ డీజీపీకి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఆమె వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. మల్లన్నను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని, అతడిని అరెస్ట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

వివరాల్లోకి వెళితే..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ఎమ్మెల్సీ కవిత హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. దీనిపై తీన్మార్ మల్లన్న స్పందిస్తూ, బీసీ రిజర్వేషన్లకు, కవితకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆమెపై కొన్ని అనుచిత వ్యాఖ్యలు చేశారు. బీసీలతో ఆమెకు కంచం పొత్తు ఉందా, మంచం పొత్తు ఉందా

వివరాలు 2లో..

విలక్షణ నటుడికి కన్నీటి వీడ్కోలు

ముగిసిన కోటా శ్రీనివాసరావు అంత్యక్రియలు

కోటకు అంతిమ సంస్కారాలు నిర్వహించిన పెద్ద మనవడు శ్రీనివాస్

- కోట శ్రీనివాసరావు ఇకలేరు - తెలుగు సినిమాకు తీరని లోటు
- రాజకీయాల్లోనూ కోట 'విభిన్న' పాత్ర
- ప్రముఖుల నుండి సంతాప సందేశాలు
- చివరి వీడ్కోలు - అభిమానుల రోదనలు

హైదరాబాద్ పెన్ పవర్: తెలుగు చిత్రసీమను తన విలక్షణ నటనతో నాలుగు దశాబ్దాలపాటు శాసించిన ప్రముఖ నటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు (82) ఆదివారం ఫిల్మ్‌నగర్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఉదయం 4 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో సినీ, రాజకీయ, సాంస్కృతిక వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతి నెలకొంది.చిత్రరంగంలో అద్భుతమైన ప్రయాణం:1942 జూలై 10న కృష్ణా జిల్లా కంకిపాడులో జన్మించిన కోట, 1978లో ప్రాణం ఖరీదు చిత్రంతో తెలుగు సినీ రంగంలో అడుగుపెట్టారు. తన వైవిధ్యభరితమైన నటనతో 750కి పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. విలన్‌గా, కామెడీ నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తనదైన శైలిలో నటించి తెలుగు సినిమాకు కొత్త మెరుగులు అద్దారు. ఆయనకు పద్మశ్రీతో పాటు అనేక పురస్కారాలు లభించాయి.కోట శ్రీనివాసరావు కేవలం కళారంగానికే పరిమితమవకుండా, 1999లో ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాసేవకు పాటుపడ్డారు. ప్రజాపక్ష రాజకీయాల్లోనూ ఆయన గొప్ప స్పష్టత, నిబద్ధత చూపారు.కోట మృతిపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు:సీఎం రేవంత్ రెడ్డి: "తెలుగు ప్రజల గుండెల్లో కోటా గారు చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆయన పోషించిన పాత్రలు అనంతమైనవి."సీఎం చంద్రబాబు నాయుడు: "తెలుగు చిత్ర పరిశ్రమకు కోట గారి మరణం తీరని లోటు. ఆయన నటనా కృషి చిరస్మరణీయమైనది."వైఎస్ జగన్ మోహన్ రెడ్డి: "కోట గారికి పద్మశ్రీతో పాటు అనేక పురస్కారాలు లభించాయి.

ఆయన నటన మనసుల్లో నిలిచిపోయే ముద్ర వేశాయి."పార్థివ దేహాన్ని సందర్శించిన సినీ ప్రముఖులు బ్రహ్మానందం, రాజేంద్రప్రసాద్, మురళీమోహన్, తనికెళ్ల భరణి, రావు రమేశ్ తదితరులు ఆయనకు నివాళులు అర్పించారు. కోట గారి మృతితో సినీ అభిమానులు, కళాభిమానులు కన్నీరు మున్నీరవుతున్నారు.కోట జీవితం %-% నటనకు అర్థం చెప్పిన పాఠంవినయంతో కూడిన వ్యక్తిత్వం, ఆలోచనాత్మక నటన, స్పష్టమైన వ్యక్తిత్వంతో కోట శ్రీనివాసరావు గారు తెలుగు సినిమాకు గౌరవాన్ని తీసుకువచ్చారు. ఆయన లేని లోటు పూడ్చలేనిది. పెన్ పవర్ బృందం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నది.

నీటి కోసం ఎదురుచూస్తున్న వారిపై కాల్పులు.. గాజాలో 19 మంది మృతి

హైదరాబాద్ పెన్ పవర్:డెయిర్ అల్ బలా: గాజాలోని సామన్య పౌరులపై ఇజ్రాయెల్ దాడులు పాశవికంగా కొనసాగుతు న్నాయి. తాగునీటి కోసం ఓ ప్రాంతంలో గుమిగూడిన జనంపై ఆదివారం జరిపిన దాడిలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు చిన్నారులు కూడా ఉన్నారు. ఈ మేరకు అక్కడి ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. తాజా మరణాలతో ఇప్పటి వరకు మృతి చెందిన

వివరాలు 2లో..

వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు

హైదరాబాద్ పెన్ పవర్: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ప్రయత్నాలు మొదలు పెట్టారు. నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు ఎక్స్ వేదికగా కీలక ప్రకటన చేశారు. 2025-2030 మధ్య కాలంలో కోటి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల కల్పన హామీ దాదాపు పూర్తయిందన్నారు.

వివరాలు 2లో..

తిరుమలలో జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం

హైదరాబాద్ పెన్ పవర్: తిరుమల శ్రీవారి ఆలయంలో పెద్దజీయంగార్లు చాతుర్మాస దీక్షను ఆదివారం(జూలై13) ప్రారంభించారు. ఆనవాయితీ ప్రకారం.. ఈ దీక్ష ప్రారంభానికి ముందు శ్రీ వరాహస్వా మివారి ఆలయాన్ని, స్వామి పుష్కరిణిని సందర్శించారు. ఆ తరువాత మంగళవా యిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేసి, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధిక రులు వారికి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనం అనంతరం పెద్దజీయర్ మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దీక్షా సంకల్పాన్ని చేపట్టారు. శ్రీ వైష్ణవ సంప్రదాయకర్త శ్రీరామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాస దీక్ష విశేషమైంది.

వివరాలు 2లో..

కేరళ సిఎంకు బెదిరింపులు..పినరయి విజయన్ ఇంట్లో బాంబు పెట్టామని మేసేజ్

పెన్ పవర్ డెస్క్:తిరువనంతపురం: కేరళ సీఎం ఇంట్లో బాంబు పెట్టామని ఆదివారం (జూలై13) బెదిరింపులు వచ్చాయి. కేరళ సీఎం పినరయి విజయన్ అధికారిక నివాసం క్లిఫ్ హౌస్ కు బాంబు పెట్టామని తుపానూర్ పోలీస్ స్టేషన్ కు ఈమెయిల్ ద్వారా బెదిరింపు మేసేజ్ వచ్చింది. అది ఎవరి ద్వారా వచ్చిందో ఇంకా గుర్తించలేదని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. క్లిఫ్ హౌస్ దగ్గర బాంబు పేలుళ్లు జరగబోతున్నాం అని పోలీసులకు మేసేజ్ పంపించారు గుర్తుతెలియని వ్యక్తులు.

వివరాలు 2లో..

మా అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమే

పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్



- ఇటీవల ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్
- ఆ సమయంలో అణు ఉద్రిక్తతలు ఏర్పడ్డాయని వార్తలు
- వివరణ ఇచ్చిన పాక్ ప్రధాని

హైదరాబాద్ పెన్ పవర్:భారత్ ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో అణు ఉద్రిక్తతలు ఏర్పడ్డాయని, పాకిస్థాన్ అణుదాడికి సిద్ధమైందని వచ్చిన కథనాలను ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తోసిపుచ్చారు. పాకిస్థాన్ అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసం, ఆత్మరక్షణ కోసమే తప్ప, ఇతరులపై దాడుల కోసం కాదని ఆయన స్పష్టం చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య

వివరాలు 2లో..

తీన్మార్ మల్లన్న ఆఫీసుపై దాడి.. గాల్లోకి కాల్పులు జరిపిన గన్ మెన్..

- క్యూ న్యూస్ ఆఫీసులో దుండగుల బీభత్సం
- నేలపై రక్తపు మరకలు, ధ్వంసమైన ఫర్నీచర్
- తెలంగాణ జాగృతి కార్యకర్తలే దాడి చేశారని ఆరోపణలు

హైదరాబాద్ పెన్ పవర్:ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సంబంధించిన క్యూ న్యూస్ కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం దాడి చేశారు. ఉదయాన్నే కొందరు కార్యాలయంలోకి ప్రవేశించి ఫర్నీచర్, కంప్యూటర్లను ధ్వంసం చేశారు. అడ్డుకున్న క్యూ న్యూస్ సిబ్బందిపైనా దాడి చేశారు. దాడి సమయంలో తీన్మార్ మల్లన్న ఆఫీసులోనే ఉన్నట్లు సమాచారం.

వివరాలు 2లో..

బీసీ రిజర్వేషన్లపై ఇతరులు లబ్ధికి యత్నించడం సమంజసమా?

హైదరాబాద్ పెన్ పవర్: ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు, క్యూ న్యూస్‌పై దాడి ఘటనపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ రెండింటినీ ఆయన ఖండించారు. కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకమని.. గన్‌మన్ కాల్పులపై విచారణ జరుగుతోందని తెలిపారు. కాంగ్రెస్ కృషి ఫలితమే బీసీ బిల్లు, రిజర్వేషన్లు అని మహేశ్‌కుమార్ చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై ఇతరులు లబ్ధికి యత్నించడం సమంజసం కాదన్నారు.

ఫీడ్ బ్యాక్ కోసం

వైసీపీ అధినేత వైఎస్ జగన్ జిల్లాల పర్యటనలకు కొద్దిరోజులు విరామం ఇచ్చి నేతలతో సమావేశం అవ్వాలని కోరుతున్నారు. నేతలతో సమావేశమై ముందు గత ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను పూర్తి స్థాయి విశ్లేషించడానికి సమయం వెచ్చించాలని నేతలు సయితం కోరుతున్నారు. గత ఐదేళ్ల పాటు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పిదాలు, తీసుకున్న నిర్ణయాలు వంటి వాటిపై గ్రౌండ్ లెవెల్ లో ఏం జరుగుతుందన్న దానిపై నేతల నుంచి విడివిడిగా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని కోరుతున్నారు. సమావేశాల్లో తాను చెప్పడమే కాకుండా, తాను చెప్పింది విని నేతలు వెళ్లే పనికి స్వస్తి చెప్పి వారికి మైకు ఇచ్చి మాట్లాడించగలిగితే చాలా వరకూ సమస్యలు పరిష్కారమవుతాయని సూచిస్తున్నారు.

పర్యటనలను సక్సెస్ అవుతున్నాయంటే?

జగన్ జిల్లాల పర్యటనలు సక్సెస్ అవుతున్నాయంటే అందుకు నేతలు, కార్యకర్తలు కారణం. ఎందుకంటే ఆంక్షలు పెట్టినా నేతలు, కార్యకర్తలు భయపడకుండా రోడ్డుపైకి వస్తున్నారంటున్నారు. అంత ఉత్సాహంతో పనిచేస్తున్న కార్యకర్తలు, నేతలు ఈసారి ఎన్నికలలో ఇచ్చే హామీలతో పాటు అధికారంలోకి వస్తే ఏం చేయాలన్న దానిపై జగన్ నుంచి క్లారిటీ వస్తే మరింత పార్టీకి హైప్ వస్తుందని చెబుతున్నారు. వాలంటీర్ల వ్యవస్థను జగన్ తీసుకు వచ్చి తప్పు చేశానని ఇంత వరకూ ఆయన అనలేదు. పైగా వాలంటీర్లను తొలగించడం అన్యాయమంటూ జగన్ అధికార టీడీపీ పై విమర్శలు చేస్తుండటంతో మళ్లీ అధికారంలోకి వస్తే వాలంటీర్ల వ్యవస్థను తిరిగి తెస్తారా? అన్న అనుమానం కార్యకర్తల్లో ఉంది.

ఎమ్మెల్యేలకు గౌరవం...

వాలంటీర్లు తిరిగి వస్తే తాము పార్టీ కోసం కష్టపడినా ప్రయోజనం ఏముంటుందని పలువురు అప్పుడే ప్రశ్నిస్తున్నారు. అలాగే కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా ఎమ్మెల్యేలను కూడా ప్రజల్లో భాగస్వామ్యులను చేయగలిగేలా జగన్ పనితీరు ఉండాలని వైసీపీ నేతలు కోరుకుంటున్నారు. తమ చేత పంపిణీ చేయిచండంతో పాటు ప్రజలకు తమను దగ్గరకు చేర్చడం వంటి పనులను చేయగలిగితేనే ఈసారి గెలిచినా తగిన గుర్తింపు ఉంటుందని, లేకపోతే 2019 తర్వాత పరిస్థితి తిరిగి పునరావృతమవుతుందని, ఎన్ని లక్షల కోట్ల రూపాయలు బటన్ నొక్కి పంపిణీ చేసినా చివరకు ఎన్నికల సమయానికి అది ఏమాత్రం పనిచేయదని కూడా చెబుతున్నారు.

కార్యకర్తలకు భరోసా...

కార్యకర్తలకు ఈసారి తాను అధికారంలోకి వస్తే పెద్దపీట వేస్తానని, ప్రాధాన్యత ఇస్తానని జగన్ పదే పదే పలు సమావేశాల్లో చెబుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది. అధికారంలోకి రాగానే తాము ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కార్యకర్తలకు ఏం చేయగలరన్న దానిపై కూడా క్లారిటీ ఉండాలని క్యాడర్ అభిప్రాయపడుతుంది. ఎమ్మెల్యేలతో పాటు క్యాడర్ ను కూడా సరిగా చూసుకుంటేనే గెలుపు సాధ్యమవుతుందని, ఈ నాలుగేళ్లు కూడా తాను చెప్పిందే విని వెళ్లాలని కాకుండా, వారి నుంచి కూడా ఫీడ్ బ్యాక్ తీసుకుని దాని ప్రకారం ముందుకు వెళితే మంచి ఫలితాలు రాబట్టుకోవచ్చని, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని క్యాష్ చేసుకోవచ్చని పలువురు సూచిస్తున్నారు. మరి జగన్ నేతల మాట వింటారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

నీటి కోసం ఎదురుచూస్తున్న వారిపై కాల్పులు..
గాజాలో 19 మంది మృతి

- మొదటి పేజీ తరువాయి

వారి సంఖ్య 58 వేలు దాటిందని తెలిపాయి. ఇజ్రాయెల్ కాల్పుల విరమణ చేపట్టాలని ప్రతిగా తమ వద్ద బందీలుగా ఉన్న ఆ దేశ పౌరుల్ని విడుదల చేయాలన్న నిబంధనతో ఇరు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. అయితే, ఆ దిశగా పరోగతి సాధించేందుకు మాత్రం వారు ముందుకు రావడం లేదు.గత వారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా పర్యటనకు వెళ్లారు. అక్కడ ట్రంప్ యంత్రాంగంతో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో కొత్త వివాదం తెరమీదకి వచ్చింది. గాజా స్ట్రిప్ నుంచి తమ బలగాలను వెనక్కి తీసుకునేందుకు ఇజ్రాయెల్ నిరాకరించింది. దక్షిణ గాజాలో తమ సైన్యాన్ని కొనసాగించాలని భావిస్తోంది. దీనిపై హమాస్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తాత్కాలిక కాల్పుల విరమణ ముగిసిన తర్వాత ఇజ్రాయెల్ మళ్లీ యుద్ధాన్ని కొనసాగించాలని చూస్తోందని, అందుకే బలగాల ఉపసంహరణకు అంగీకరించడం లేదని వాదిస్తోంది.మరోవైపు హమాస్ పూర్తిగా లొంగిపోయినప్పుడే యుద్ధానికి ముగింపు పలుకుతామని ఇజ్రాయెల్ తెగేసి చెబుతోంది. కానీ, హమాస్ అందుకు నిరాకరిస్తోంది. తమ వద్ద బందీలుగా ఉన్న 50 మందిలో సగం మంది మాత్రమే బతికి ఉన్నారని చెబుతోంది. ప్రతిగా ఇజ్రాయెల్ యుద్ధాన్ని విరమించుకోవాలని, ఇక్కడి నుంచి తమ బలగాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.

వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు

- మొదటి పేజీ తరువాయి

గడిచిన ఐదేళ్లలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయగా.. దాదాపు 39 లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు నీతీశ్ చెప్పారు. గతంతో పోల్చుకుంటే ఈసారి రెట్టింపు ఉద్యోగాలు కల్పించబోతున్నామన్నారు. కేవలం ప్రభుత్వ సెక్టార్‌లోనే కాకుండా ప్రైవేటు, ఇతర పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు నీతీశ్ పేర్కొన్నారు.

“ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. ప్రైవేటు రంగంలో మరో 39 లక్షల మందికి ఉపాధి కల్పించాం. గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల హామీ దాదాపు నెరవేరినట్లే. ఇప్పుడు లక్ష్యాన్ని రెట్టింపు చేస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలిస్తాం. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాం. ప్రధానంగా పారిశ్రామిక రంగాల్లో యువతకు ఉపాధి చూపిస్తాం” అని నీతీశ్ కుమార్ పేర్కొన్నారు. బిహార్‌లో ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశముంది.

కేరళ సిఎంకు బెదిరింపులు..పినరయి విజయన్ ఇంట్లో బాంబు పెట్టామని మేసేజ్

- మొదటి పేజీ తరువాయి

అప్రమత్తమైన పోలీసులుసెర్చింగ్ నిర్వహించారు. డాగ్ ,బాంబ్ స్క్వాడ్ల తో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈతనిఖీల్లో ఎటువంటి అనుమానాస్పదం వస్తువులు దొరకలేదని పోలీసులు తెలిపారు. సోదాలు జరిగిన సమయంలో సీఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కీలక సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల వచ్చిన బాంబు బెదిరింపులకు ఈ బెదిరింపు సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.

మా అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమే

- మొదటి పేజీ తరువాయి

ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది. గతంలో పాకిస్థాన్ నుంచి “అణు బ్లాక్‌మెయిల్” కుట్రలు జరిగాయని ఆరోపణలు రావడంతో, భారత్ వాటిని ద్వైపాక్షికంగా ఎదుర్కొంటామని శపథం చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనే, భారత్ సింధు నదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీనికి ప్రతిస్పందనగా, పాకిస్తాన్ తమ “సంపూర్ణ బలంతో” ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఈ ప్రకటన అణు బెదిరింపుగానే భావించాల్సి ఉంటుందని విస్తృతంగా ప్రచారం జరిగింది.ఏప్రిల్ 22న పహల్గామ్ దాడికి ప్రతీకారంగా మే 7న భారత్ ‘ఆపరేషన్ సిందూర్’ను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే షెహబాజ్ షరీఫ్ అణ్వాయుధాల గురించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. పాకిస్థాన్ యొక్క అణ్వాయుధ సామర్థ్యం దేశ భద్రతకు కట్టుబడి ఉందని, కానీ అది దౌర్జన్యం చేసేందుకు ఉద్దేశించినది కాదని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడటమే పాకిస్థాన్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థపై ఐఎల్ఓ దీర్ఘకాలిక చర్చ

గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ కార్మికులకు కట్టుబడి ఉండే ప్రపంచ ప్రమాణాలను రూపొందించాలనే ఐఎల్ఓ ప్రతిపాదన కార్మిక హక్కులకు ఒక మలుపును సూచిస్తుంది

భారతదేశం గిగ్ కార్మికుల కోసం సామాజిక భద్రతా చర్యలను అమలు చేస్తున్నందున, ఐఎల్ఓ ప్రతిపాదన నియంత్రణ విధానాన్ని రూపొందించడంలో ఒక సూచన బిందువుగా ఉపయోగపడుతుంది

ఐఎల్ఓ 13వ అంతర్జాతీయ కార్మిక సదస్సు:

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) జూన్ 2-13, 2025 వరకు జరిగిన 13వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ముగించింది, ప్రతి సంవత్సరం, 187 సభ్య దేశాల నుండి ప్రభుత్వం, యజమాని మరియు కార్మికుల ప్రతినిధులు అంతర్జాతీయ కార్మిక ప్రమాణాలను రూపొందించడానికి మరియు ఐఎల్ఓ విస్తృత విధాన దిశలను నిర్వచించడానికి ఐఎల్‌సి వద్ద సమావేశమవుతారు.

ఈ సమావేశం ముఖ్యాంశాలలో ఒకటి “ప్లాట్‌ఫామ్ ఎకానమీలో డీసెంట్ వర్క్” పై చర్చ, ఇది ఎజెండాలో ఐదవ అంశంగా కనిపించింది. ఇది ఈ అంశంపై మొదటి ప్రామాణిక సెట్టింగ్ చర్చగా గుర్తించబడింది. ఐఎల్ఓ పాలకమండలి మొదట ఈ ఎజెండా అంశాన్ని 2021లో ప్రతిపాదించింది, దీనిలో 113వ ఐఎల్‌సి (2025)లో మొదటి సెషన్‌తో డబుల్ చర్చా విధానాన్ని అవలంబించారు, రెండవది 2026లో 114వ ఐఎల్‌సి కి షెడ్యూల్ చేయబడింది.

ప్రామాణిక ప్రమాణాల దిశగా కీలక పురోగతి:

11వ ఐఎల్‌సి యొక్క ప్రధాన పురోగతి ఏమిటంటే, ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థ కోసం ప్రత్యేకంగా బైండింగ్ ప్రపంచ కార్మిక ప్రమాణాలను అభివృద్ధి చేయడానికి ఏకాభిప్రాయం. ఈ చర్చలు సాధ్యమయ్యే ప్రమాణాల రకాలు మరియు పరిధిని వివరించే ఐఎల్ఓ నివేదికలో ఆధారపడి ఉన్నాయి. ప్లాట్‌ఫామ్ కార్మికులు మరియు డిజిటల్ కార్మిక వేదికలు రెండింటినీ ఎలా నిర్వచించాలనే క్లిష్టమైన సమస్యను పరిష్కరించాయి. సిఫార్సుతో అనుబంధంగా కొత్త సమావేశాన్ని స్వీకరించడానికి, రెండవ చర్చ కోసం ఈ అంశం 14వ ఐఎల్‌సి కి తిరిగి వస్తుందని అధికారికంగా అంగీకరించబడింది.

ఐఎల్ఓ యొక్క ప్రతిపాదిత సమావేశం మరియు సిఫార్సు వేగంగా విస్తరిస్తున్న గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థను నియంత్రించే దిశగా ఒక ప్రధాన అడుగును సూచిస్తుంది. ప్రస్తుతం, డిజిటల్ ప్లాట్‌ఫామ్ కార్మికులకు అంతర్జాతీయంగా ఆమోదించబడిన నిర్వచనం లేదు, లేదా వారి పని పరిస్థితులను ప్రత్యేకంగా పరిష్కరించే ఈ బైండింగ్ పరస్పర కార్మిక ప్రమాణాలు కూడా లేవు. ప్లాట్‌ఫామ్ కార్మికులు తరచుగా మంచి పని లోటులను ఎదుర్కొంటారు, వాటిలో సామాజిక భద్రత లేకపోవడం, ఆదాయ అస్థిరత మరియు ప్రాథమిక కార్మికుల హక్కులకు పరిమిత ప్రాప్యత ఉన్నాయి. ఇది ఎక్కువగా స్వయం ఉపాధి పొందిన వారిగా వారి తప్పు వర్గీకరణ కారణంగా ఉంది, ఇది వారిని జాతీయ కార్మిక రక్షణల నుండి మినహాయించింది. ఈ సవాళ్లకు అతీతంగా, ప్లాట్‌ఫామ్ కార్మికులు అల్గోరిథమిక్ నిర్వహణ, స్వచ్ఛంద ఖాతా నిష్క్రియాలలో అపారదర్శక డేటా పద్ధతులు మరియు వివాదాలలో పరిమిత సహాయానికి కూడా లోబడి ఉంటారు.

ప్రతిపాదిత అంతర్జాతీయ ప్రమాణాలు డిజిటల్ లేబర్ ప్లాట్‌ఫామ్‌లు, ప్లాట్‌ఫామ్ కార్మికులు, మధ్యవర్తులు మరియు వేతనం వంటి పదాల యొక్క ప్రపంచవ్యాప్తంగా అంగీకరించబడిన నిర్వచనాలను ప్రవేశపెట్టడం ద్వారా ఈ అంతరాలను సమగ్రంగా పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ ప్రమాణాలను ఆమోదించినట్లయితే, సభ్య దేశాలు కార్మికులకు పనిలో ప్రాథమిక హక్కులను ప్లాట్‌ఫామ్ చేయడానికి హామీ ఇవ్వాలి, వాటిలో సంఘం స్వేచ్ఛ, బలవంతపు మరియు బాల కార్మికుల నుండి రక్షణ, వివక్షత లేనిది మరియు వృత్తిపరమైన భద్రత మరియు ఆరోగ్యం ఉన్నాయి.

ప్లాట్‌ఫామ్ కార్మికుల తప్పుడు వర్గీకరణను నివారించడానికి సరైన ఉపాధి వర్గీకరణ సమస్యను కూడా ఇది పరిష్కరిస్తుంది. ఇది అన్ని ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రతా రక్షణలు మరియు అల్గోరిథమిక్ పారదర్శకత, డేటా గోప్యత, ఖాతా నిష్క్రియం మరియు ఆటోమేటెడ్ వ్యవస్థల ఉపయోగం వంటి కీలకమైన సమస్యలకు సంబంధించిన అంచనాలను కూడా కలిగి ఉంటుంది.

నియంత్రణలో అంతర్జాతీయ లోటును తీర్చే దిశగా ఐఎల్ఓ:

ప్రపంచవ్యాప్తంగా, గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థను నియంత్రించడానికి దేశాలు ఫ్రేమ్‌వర్క్‌లను అభివృద్ధి చేయాలనే పట్టులో ఉన్నాయి. ప్లాట్‌ఫామ్ కార్మికులను రక్షించడానికి నియంత్రణ ప్రయత్నాలు సాపేక్షంగా ప్రారంభ దశలో ఉన్నాయి, ఎక్కువగా 2022 నుండి ఉద్భవిస్తున్నాయి, ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు మూడు ప్రధాన విధానాలను అవలంబిస్తున్నాయి: ప్లాట్‌ఫామ్ కార్మికులను (యుఎస్, బెల్జియం, చిలీ ఈక్వెడార్) చేర్చడానికి ఉన్న కార్మిక చట్టాలను సవరించడం, గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ కార్మికుల కోసం ప్రత్యేకంగా స్వతంత్ర చట్టాన్ని ప్రవేశపెట్టడం (యూరోపియన్ యూనియన్, అర్జెంటీనా, పెరూ), మరియు ఇప్పటికే ఉన్న రక్షణలను విస్తరించడానికి ప్లాట్‌ఫామ్ కార్మికుల ఉపాధి స్థితిని స్పష్టం చేయడం (పోర్చుగల్ & మారిషస్)

ఇప్పటివరకు, చాలా నియంత్రణ చొరవలు అధిక ఆదాయ దేశాల నుండి, ముఖ్యంగా యూరప్, ఉత్తర అమెరికా మరియు లాటిన్ అమెరికాలో నుండి వచ్చాయి. అందువల్ల, ఐఎల్ఓ యొక్క ప్రామాణిక-నిర్ణయ ప్రతిపాదన ప్రస్తుతం ప్లాట్‌ఫామ్ పని కోసం వారి స్వంత నియంత్రణ చట్రాలను రూపొందించే దేశాలకు ప్రపంచ సూచన బిందువును అందిస్తుంది

భారతదేశంఅడుగు ముందుకు:

ఐఎల్ఓ లో ఈ చర్చలు ప్రపంచ నిబంధనలను రూపొందిస్తున్నప్పటికీ. భారతదేశం తన ప్లాట్‌ఫామ్ వర్క్‌ఫోర్స్‌ను రక్షించుకోవడానికి గణనీయమైన జాతీయ సంస్కరణలను కూడా చేపట్టింది. సామాజిక భద్రతా నియమావళి (సిఎస్ఎస్) 2020 ప్లాట్‌ఫామ్ కార్మికులను ఒక ప్రత్యేక వర్గంగా గుర్తిస్తుంది మరియు జీవిత మరియు వైకల్య భీమా, ప్రమాద కవరేజ్, ఆరోగ్య మరియు ప్రసూతి ప్రయోజనాలు, పెన్షన్ పథకాలు మరియు క్రెచ్ సౌకర్యాలు వంటి సమగ్ర సంక్షేమ చర్యలకు పునాది వేస్తుంది. సిఎస్ఎస్ 2020 సామాజిక భద్రతా నిధిని మరియు పర్యవేక్షణ కోసం జాతీయ సామాజిక భద్రతా బోర్డును ఏర్పాటు చేయడాన్ని కూడా అందిస్తుంది.

ఇ-శ్రమ్ డేటాబేస్‌తో ముందున్న భారత్:

భారతదేశపు ఇ-శ్రమ్ పోర్టల్, జాతీయ డిజిటల్ డేటాబేస్, గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్‌తో సహా ఇప్పటికే 300 మిలియన్ల అసంఘటిత కార్మికులను నమోదు చేసింది, ఇది సంక్షేమ ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకుంది. 2025-26 కేంద్ర బడ్జెట్ ప్లాట్‌ఫారమ్ కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేయడం, ఇ-శ్రమ్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళీకృతం చేయడం మరియు ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద ఆరోగ్య సంరక్షణకు ప్రాప్యతను విస్తరించడం వంటి కీలక అంశాలతో ఈ శ్రామిక శక్తిని మరింత బలపరిచింది.

కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ యొక్క పైలట్ చొరవ ప్లాట్‌ఫారమ్ కార్మికులు మరియు అగ్రిగేటర్‌లను ఇ-శ్రమ్ పోర్టల్‌లోకి తీసుకురావడంలో చురుకుగా ఉంది. అర్బన్ కంపెనీ, జొమాటో, బ్లింకిట్ మరియు అంకుల్ డెలివరీ వంటి ప్రధాన కంపెనీలు ఇప్పటికే ఈ ప్రయత్నంలో చేరాయి. అదనంగా, రాజస్థాన్ మరియు కర్ణాటక వంటి రాష్ట్రాలు చట్టాలను రూపొందించాయి మరియు జార?ండ్ గిగ్ కార్మికుల కోసం ప్రత్యేకంగా ముసాయిదా బిల్లులను ప్రతిపాదించింది, ఇవి ఈ కార్మికుల సామాజిక భద్రత కోసం చర్యలను అందిస్తాయి.

అయితే, ఉపాధి వర్గీకరణ యొక్క క్లిష్టమైన సమస్యను స్పష్టంగా పరిష్కరించకుండా ప్రధానంగా సామాజిక భద్రతా కవరేజీపై దృష్టి సారించినందుకు భారతదేశం యొక్క విధానం విమర్శలను ఎదుర్కొంది. అభివృద్ధి చెందుతున్న దేశంగా, భారతదేశం ప్లాట్‌ఫామ్ కార్మికులను రక్షించడం, ఆవిష్కరణలు, ఉద్యోగ సృష్టి మరియు ఈ రంగం అందించే వశ్యతను పెంపొందించడం అనే ద్వంద్వ సవాలును ఎదుర్కొంటుంది. కార్మికులను ఉద్యోగులుగా వర్గీకరిస్తే ప్లాట్‌ఫామ్‌ల ఖర్చులు 20-30శాతం పెరుగుతాయని అంచనాలు చూపిస్తున్నాయి. అయినప్పటికీ, లక్షలాది మంది పనితీరు గల కార్మికులకు సామాజిక భద్రతా కవరేజీని విస్తరించడం వారి పని పరిస్థితులను మెరుగుపరచడంలో ఒక ముఖ్యమైన స్టెప్‌గా మిగిలిపోయింది.

భవిష్యత్తు దిశగా త్రైపాక్షిక చర్చలు:

ఐఎల్ఓ లో జరుగుతున్న త్రైపాక్షిక చర్చలు ప్రపంచవ్యాప్తంగా పని భవిష్యత్తును రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. చివరికి ఒక కన్వెన్షన్ మరియు సిఫార్సును స్వీకరించడం ప్లాట్‌ఫామ్ పని నియంత్రణలో ఒక మలుపును సూచిస్తుంది మరియు గిగ్ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన నియంత్రణ అంతరాలను మూసివేయడంలో సహాయపడుతుంది. తదుపరి కీలక మైలురాయి సభ్య దేశాల ఆమోదం, ఇది ఈ అంతర్జాతీయ ప్రమాణాల వాస్తవ ప్రపంచ ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. ప్లాట్‌ఫామ్ కార్మికుల హక్కులను గుర్తించడానికి ఐఎల్ఓ చేస్తున్న చురుకైన ప్రయత్నాలు సకాలంలో మరియు ప్రశంసనీయమైనవి. ప్లాట్‌ఫామ్ కార్మికుల హక్కులు, రక్షణలు మరియు గౌరవప్రదమైన పని పరిస్థితులు విశ్వవ్యాప్తంగా గుర్తించబడి అమలు చేయబడుతున్నాయని నిర్ధారించుకోవడానికి ఈ రంగానికి అంతర్జాతీయ కార్మిక ప్రమాణాలను అభివృద్ధి చేయడం చాలా అవసరం.

ప్రొఫెసర్. శ్రీగౌరి కోసూరి
డిపార్ట్‌మెంట్ ఆఫ్ లేబర్ లా
సవీత స్కూల్ ఆఫ్ లా,
సవీత విశ్వవిద్యాలయం,చెన్నై.

బోనాల సంబరం..

- మొదటి పేజీ తరువాయి

మంత్రి సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తన అర్ధాంగితో కలిసి ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని తాను ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. మహిళా భక్తులు అన్నం, బెల్లం, పెరుగు, వేప ఆకులతో వండిన ‘బోనం’ను అమ్మవారికి సమర్పించారు. ఆలయం, దాని చుట్టుపక్కల వీధులన్నీ పండుగ వాతావరణంతో నిండిపోయాయి. సంప్రదాయ వస్త్రధారణతో ఉన్న మహిళలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వేడుకలు సజావుగా, శాంతియుతంగా జరిగేలా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మహిళా భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

ఈ పండుగ తెలంగాణ విశిష్ట సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుంది. ‘రంగం’తో ఈ పండుగ ముగుస్తుంది. ఈ ‘రంగం’లో అవివాహిత మహిళ రాష్ట్ర భవిష్యత్తు గురించి అంచనాలను వెల్లడిస్తారు. ఆ తర్వాత ఘట్టాల ఊరేగింపు జరుగుతుంది. దీని తరువాత అమ్మవారి చిత్రపటాన్ని మోస్తున్న అలంకరించిన ఏనుగుతో ఊరేగింపు ఉంటుంది. పసుపు, కుంకుమ పూసుకున్న పోతరాజులు లయబద్ధమైన డప్పుల శబ్దానికి నృత్యం చేస్తూ ఊరేగింపుగా వివిధ ప్రాంతాల గుండా వెళతారు.

ఆషాఢ బోనాలు హిందూ క్యాలెండర్ ప్రకారం ఆషాఢ మాసంలో మహంకాళి అమ్మవారిని ఆరాధించే పండుగ. భక్తులు, ముఖ్యంగా మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన కుండలలో ఆహారం రూపంలో నైవేద్యాలు సమర్పిస్తారు. ఈ పండుగలో భాగంగా ప్రజలు ‘రంగం’ లేదా భవిష్యత్తు అంచనా, ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. సికింద్రాబాద్‌లో జరిగే బోనాలను లష్కర్ బోనాలు అని కూడా పిలుస్తారు. ఇది హైదరాబాద్ మరియు సికింద్రాబాద్ జంట నగరాల్లో దాదాపు నెలరోజుల పాటు జరిగే సంప్రదాయ పండుగలో రెండవ దశ. ఈ పండుగ గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయంలో ప్రారంభమైంది. పాతబస్తీలోని లాల్ దర్వాజాలోని

శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయం, హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయాల్లో వచ్చే ఆదివారం ఉత్సవాలు జరగనున్నాయి. సుమారు 150 సంవత్సరాల క్రితం కలరా వ్యాధి తీవ్రంగా ప్రబలిన తర్వాత ఈ పండుగ మొదట జరుపుకున్నారని నమ్ముతారు. మహంకాళి అమ్మవారి కోపం వలనే ఈ మహమ్మారి వచ్చిందని ప్రజలు నమ్మి, ఆమెను శాంతింపజేయడానికి బోనాలు సమర్పించడం ప్రారంభించారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించింది.

తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయాలి... అరెస్ట్ చేయాలి

- మొదటి పేజీ తరువాయి

అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వివాదం చెలరేగింది. మల్లన్న వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆయన కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసమైంది. తనపై, జాగృతి కార్యకర్తలపై కాల్పులకు పురిగొల్పేలా మల్లన్న మాట్లాడారని కవిత తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజకీయాల్లోకి వచ్చే మహిళలను కించపరిచేలా మాట్లాడటం సరికాదని, బీసీల పక్షాన పోరాడుతున్నందుకే తనపై ఉద్దేశపూర్వకంగా దాడి చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

మరోవైపు, తన కార్యాలయంపై దాడి జరిగిన ఘటనపై తీన్మార్ మల్లన్న కూడా స్పందించారు. కవిత అనుచరులు తనపై హత్యాయత్నం చేశారని, తన గన్‌మెన్ గాల్లోకి కాల్పులు జరపడంతో ప్రాణాలతో బయటపడ్డానని ఆయన ఆరోపించారు. ఈ పరిణామాలతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

తీన్మార్ మల్లన్న ఆఫీసుపై దాడి..
గాల్లోకి కాల్పులు జరిపిన గన్ మెన్..

- మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్సీ మల్లన్న గన్ మెన్లు గాల్లోకి ఐదు రౌండ్ల కాల్పులు జరిపారని తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్యూ న్యూస్ ఆఫీసును పరిశీలించారు.

దాడికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు. కాగా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగానే ఈ దాడి జరిగిందని, జాగృతి కార్యకర్తలే దాడి చేశారని సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, దుండగులు సృష్టించిన బీభత్సం, కార్యాలయంలో రక్తపు మరకలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

తిరుమలలో జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం

- మొదటి పేజీ తరువాయి

ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటారని ప్రాశస్త్యం ఉంది. ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యం అని అంటారు. చాతుర్మాస వ్రతం ప్రాచీన కాలం నుంచి ఆచనలో ఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి. ముందుగా శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి మఠంలో కలశ స్థాపన, కలశ పూజ, విష్వక్సేనారాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తరువాత సేకరించిన పుట్ట మన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం శ్రీ పెద్దజీయంగారు తిరుమల బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కనగల జీయ్యంగారి మఠం దగ్గరనుంచి శ్రీ చిన్నజీయంగారు , ఇతర శిష్యబృందంతో తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ స్వామి పుష్కరిణి, శ్రీ వరాహస్వామివారి బాలాలయాన్ని సందర్శించారు. అక్కడినుంచి మంగళవాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేశారు.

శ్రీవారి ఆలయ మహద్వారం చెంత టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఇతర ఆలయ అధికారులతో కలిసి సంప్రదాయబద్ధంగా

స్వాగతం పలికారు. శ్రీ జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్న తరువాత శ్రీ పెద్దజీయంగారికి మేల్‌చాట్ వస్త్రాన్ని, శ్రీ చిన్నజీయంగారికి నూలుచాట్ వస్త్రాన్ని బహూకరించారు. అనంతరం శ్రీపెద్దజీయర్ మఠంలో శ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీ చిన్నజీయర్‌స్వామి కలిసి ఈవో, అదనపు ఈవోలను శాలువతో సన్మానించారు.

పారిశ్రామిక నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ

● నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖ దక్షిణం పెన్ పవర్ జూలై 13 : పారిశ్రామిక నగరమైన గాజువాక ప్రాంతాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టి అభివృద్ధి చేయడం జరుగుతుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన 6 వ జోన్ 65, 71, 86 వార్డుల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల కు గాజువాక శాసనసభ్యులు, రాష్ట్ర తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్లు బొడ్డు నరసింహ పాత్రుడు, రాజాన రామారావు, లేళ్ల కోటేశ్వరరావు, తెలుగుదేశం డిప్యూటీ ఫోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు తో కలిసి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ పారిశ్రామిక నగరమైన గాజువాక ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం అభివృద్ధి కార్యక్రమాల తో పాటు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. 65 వార్డు ప్రియదర్శిని కాలనీ విశాఖ నగర్ సంజీవయ్య గిరి కాలనీ అశోక్ నగర్ తదితర ప్రాంతాలలో సుమారు రూ.5.55 కోట్ల వ్యయంతో వి ఆర్ సి సి డ్రైన్లు, రిటర్నింగ్ వాల్స్ తాగునీటి పైపులైన్లు పలుచోట్ల నిర్మాణ పనులకు, 71 వ వార్డు ఆటోనగర్ లో సుమారు రూ.49.60 లక్షల వ్యయంతో తాగునీటి పైపైన్ లకు, 86వ వార్డు పరిధిలో పలుచోట్ల సుమారు రూ.1.54 కోట్ల వ్యయంతో సిసి రోడ్లు, ఆర్ సి సి డ్రైన్, సీసీ కల్వర్టులు, వి ఆర్ సి సి బాక్స్ కల్వర్టులు నిర్మాణానికి జీవీఎంసీ నిధులు తో శంకుస్థాపన చేసామని తెలిపారు. అనంతరం గాజువాక శాసనసభ్యులు మాట్లాడుతూ అభి వృద్ధిలో గాజువాక నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానం ఉండేలా నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. గాజువాక లోని ప్రతి వార్డును అంచెలంచెలుగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కార్యచరణ చేపట్టడం జరిగిందని తెలిపారు. 65, 71, 86 వార్డులలో సుమారు రూ. 7.59 కోట్ల వ్యయంతో రోడ్లు కాలువలు కల్వట్లు రిటర్నింగ్ వాల్స్ తాగునీటి పైపైన్ లకు నగర మేయర్ తో కలిసి శంకుస్థా పన చేసామని, రాష్ట్ర ముఖ్యమంత్రి అనుని త్యం రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆయన పాలనలో అభివృద్ధి సంక్షేమము రెండు సమదృష్టితో పరిపాలన చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 6వ జోనల్ కమిష నర్ బి.ఆర్.ఎస్. శేషాద్రి, జీవీఎంసీ కార్యని ర్వాహక ఇంజనీరు ఎమ్.ఆర్.ఎస్ ప్రసాద్, సహాయక ఇంజనీరు కేదార్ నాథ్, పలువురు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతామని భీమిలి ఎమ్మెల్యే గంటా

భిమిలి,పెన్ పవర్, జులై 13. :ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి.. ఆడబిడ్డ నిధి.. విషయంలో అధ్యయనం జరుగుతుందని, తొందర్లోనే లబ్ధిదారులకు అందిస్తామని ఆయన తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం జీవీఎంసీ 7 వ వార్డు స్వతంత్ర నగర్ లో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీలను వచ్చే నెల నుంచి అమలు చేయనున్నట్టు వెల్లడించారు. ఎన్నికల్లో చెప్పిన మాట ప్రకారం పెన్షన్ ను రూ. 3 వేల నుంచి రూ. 4 వేలకు పెంచామని.. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం అందజేశామని చెప్పారు. స్వతంత్ర నగర్ లో తమ ఇంటి స్లాబ్ సరిగా లేక వర్షపు నీరు కారుతుందని, ప్రభుత్వం తరపున సాయం చేసి ఆదుకోవాలని ఒక మహిళ ఎమ్మెల్యేను కోరగా, సమస్య పరిష్కారానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, టీడీపీ నాయకులు పిల్లా వెంకట్రావు, అచ్యుతరావు, మొల్లి లక్ష్మణరావు, మామిడి దుర్గారావు, గరే గుర్నాథ్, జానకిరామ్, నాగోతి సూర్యప్రకాష్, వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి.

గుమ్మలక్ష్మీపురం జులై 13. పెన్ పవర్. చెముడుగూడ, అడ్డంగూడ, తాటిశీల, గ్రామాల్లో ఆదివారం నాడు మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్ ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ముందుగా టీడీపీ నాయకులు,గ్రామస్తులు పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరిగి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి,సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధి, సంక్షేమం. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే చేశామని, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నాం. పింఛన్ రూ. 1000 పెంచడానికి జగన్మోహన్ రెడ్డికి ఐదేళ్లు పడితే చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే ఒక్క సంతకంతో పింఛను రూ.4000 వేలకు పెంచారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇచ్చాం, మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించబోతున్నాం. ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ కూడా అందజేస్తాం అని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్పర్సన్ కడ్రక కళావతి,మాజీ సర్పంచ్ రామారావు,కొండలరావు, భాస్కర్ రావు,సదానంద్,రవి, శ్రీను,ఈశ్వర్,మంగయ్య,ప్రకాష్,కూటమి నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

సుపరిపాలన కూటమితోనే సాధ్యం

వార్డ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం

గాజువాక:పెన్ పవర్,జూలై 13: సుపరిపాలన కుటమి తోనే సాధ్యమని వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం జగన్ అన్నారు. ఈ సందర్భంగా రమాదేవి మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కూటమితోనే సాధ్యమని, సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీలను అమలుపరుస్తున్నారని, పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి లు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జివిఎంసి లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్.

విశాఖ దక్షిణం, పెన్ పవర్ జూలై 13 : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాలయా లలోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" 2025 జులై 14వ తేదీ సోమవా రం ఉదయం 11.00 గంటల నుండి మధ్యా హ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. కావున, నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హారికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై జులై 14వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరు చుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మే యర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు.

వైకుంఠ వెంకటేశ్వర స్వామి మహాభిషేకం పంచామృత అభిషేకాలు

గాజువాక : పెన్ పవర్ , జూలై 13: జీవీఎంసీ 65 వ వార్డు పరిధి వాంబే కాలనీ గరుడాద్రి కొండపై కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ నక్షత్రం స్వామివారి జన్మ నక్షత్రం పురస్కరించుకొని ఉదయం 5 గంటల నుండి మహాభిషేకం పంచామృత అభిషేకలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం నాడు స్వామివారికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఉత్తర ద్వారంలో వెలసిన రెండవ ఆలయముగా గరుడాద్రి కొండపై వెలిసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం స్వామి వారికి పంచామృత అభిషేకాలతో పాటు వివిధ రకాల పళ్ళ రసాలు కుంకుమ పూజలు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీనివాస ఆచార్యులు చే మహాభిషేకం నిర్వహించడం జరిగినది. వచ్చే అమావాస్య రోజున కాలభైరవ స్వామికి అభిషేకాలు, శ్రావణమాసం సందర్భంగా ప్రతి శుక్రవారం

సాయంత్రం లక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు స్వామివారి ప్రత్యేక అభిషేకలు దర్శనాలు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాజు,నాగమణి, చిట్టెమ్మ,హిమజ, పి. సత్యవతి, శ్రీలక్ష్మి, కాంతమ్మ, భవాని, కుమారి ,రమ ,విద్య, పుష్పలతతదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కోసం విరాళాలు ఇచ్చే దాతలు ఆలయ కమిటీ వారిని సంప్రదించాల్సిందిగా కోరారు.

బూడి లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీటీసీ పసుపులేటి నాగమణి

గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జులై 13: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జీకే వీధి పంచాయతీకి చెందిన కొత్తగూడెం గ్రామంలో ఇటీవల మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బూడి లక్ష్మయ్య కుటుంబాన్ని పాడేరు మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి సూచనల మేరకు స్థానిక ఎంపీటీసీ పసుపులేటి నాగమణి ఆదివారం పరామర్శించారు. కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విధ్వంసం నుండి వికాసం వైపు కార్యక్రమానికి విశేష స్పందన

గాజువాక పెన్ పవర్, జూలై 13: జీవియంసి 66 వార్డులో జరుగుతున్న విధ్వంసం నుండి వికాసం వైపు ప్రయాణం సుపరిపాలన కార్యక్రమంలో నిరంతరం క్లస్టర్, కో క్లస్టర్, బూతు ఇన్చార్జెస్ కి, కె ఎస్ ఎస్ లు కి, మహిళా సోదరీమణులు సీనియర్ తెలుగుదేశం నాయకులు, పార్టీ తరఫున అందరికి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు,శుభోదయం కార్యక్రమంలో పాల్గొన్న 12 రోజుల్లో అందరూ చాలా చేరవేగంగా కార్యక్రమం చేస్తున్నాం, నాలుగు బూతుల్లో కొంత సమయం లేట్ అయిందని, ఆ బూతులు కూడా చైతు మొదలుపెడితే గాజువాక నియోజవర్గంలో వార్డు ప్రథమ స్థానంలో ఉంటుంది, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఇంకా కొంత సమయాన్ని కేటాయించి ఉప్పరకోలని డోర్ టు డోర్ సర్వేలో పాల్గొందామని అందరికీ ఒక రిక్వెస్ట్ చేస్తూ విన్నపం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు గోమాడవాసు తెలిపారు.

సుపరిపాలనలో తొలి అడుగు

● డోర్ టు డోర్ క్యాంపెయిన్

గాజువాక :పెన్ పవర్, జూలై 13:మహావిశాఖ నగరపాలక సంస్థ85 వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర ఆధ్వర్యంలో 85వ వార్డు పరిశీలకలగా నియమించినటువంటి కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ ని వార్డులో ఉన్న నాయకులు అందరికీ కూడా పరిచయం చేసి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైతే తెలుగుదేశం పార్టీ సుపరిపాలన తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమం ను సమర్థవంతంగా ప్రతి ఒక్కరు కూడా పూర్తి చేయాలని నేను ఎప్పటికప్పుడు ఈ యొక్క సమాచారాన్ని పార్టీ ఆఫీసుకి అందిస్తానని తెలియజేశారు . ఎవరికైనా సమస్యలు ఉంటే వినతిపత్రం రూపంలో ఇస్తే అవన్నీ కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిద్దామని అన్నారు. ఇల్లపు ప్రసాదు, విందుల రాజు, బలిరెడ్డి సత్యనారాయణ, డొక్కా రమేష్, గుర్రం నూకరాజు, మొల్లి కోటేశ్వరరావు,కడవల రమణ, కత్తి తిలక్, కసిపల్లి శ్రీనివాసరావు, గజ్జల నూకరాజు,మేడిశెట్టి వెంకటేశ్వరరావు, పెదపాటి శివరామకృష్ణ,గొద్దు గురుమూర్తి, కొర్రాయి జగదీష్, ముచ్చురాజు, చందు రమేష్, దానబాల అర్జున, అమర పిన్ని త్రినాథ్, కురందాసు దుర్గారావు, కొయ్య సింహాద్రి,గొల్లవిల్లి సత్యారావు, పాలవలస ఈశ్వరరావు, గుంటు రమేష్, పలక అచ్యుత్ , పొన్నగంటి వెంకటరమణ, ఎల్లపు ఈశ్వరరావు, గుదే శంకర్ ,వద్దాది శ్రీను,ఉరుకూటి రాజు, కర్రి తలుపుల నాయుడు, ఛట్టి నాగరాజు ,ముసిలి నాయుడు, పూడి యుగేందర్,గీతా అన్నపూర్ణ, సత్యవతి, శిరీష, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

76 వార్డు నూతన కమిటీ నియామకం

● వార్డు అధ్యక్షుడిగా జిత్తుక అప్పలరాజు.
● సెక్రటరీగా కూన వెంకట్రావు.

గాజువాక పెన్ పవర్, జూలై 13: జీ.వీ.ఎం.సీ 76వ వార్డు టిడిపి నూతన కమిటీని ఆదివారం నియమించారు. పాత కమిటీని రద్దు చేస్తూ, కొత్త కమిటీ వార్డు అధ్యక్షుడిగా జిత్తుక అప్పలరాజు, సెక్రటరీగా కూన వెంకట్రావు ల పేర్లు ను గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వార్డ్ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ నూతన కమిటీని నియమించినట్లు ఆయన తెలిపారు. నూతన కమిటీకి అభినందనలు తెలియజేస్తూ పార్ట్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఉప్పాల హారికపై దాడి ఘటనకు హోంమంత్రి సమాధానం చెప్పాలి

● అరాచక శక్తులను అదుపు చేసే బాధ్యత పోలీసులకు లేదా.?
● సూటిగా ప్రశ్నించిన మాజీ మంత్రి అంబటి రాంబాబు
● గుంటూరు క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి అంబటి రాంబాబు
● చంద్రబాబు, లోకేష్‌ల ప్రోత్సాహంతోనే దాడులు
● డీజీపీ పచ్చచొక్కా వేసుకుని పనిచేస్తున్నాడు
● రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదు
● ఒక బీసీ మహిళా ప్రజా ప్రతినిధిపై దాడి చేయడానికి సిగ్గుపడాలి
● మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

గుంటూరు:పెన్ పవర్, జూలై 13 కృష్ణాజిల్లా జెడ్పీ చైర్ పర్సన్, బీసీ నాయకురాలు ఉప్పాల హారికపై జరిగిన దాడి ఘటనకు హోంమంత్రి అనిత సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, వైయస్ఆర్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. గుంటూరు క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌ల ప్రోత్సాహంతోనే టీడీపీ సైకోలు ఈ దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. రాష్ట్రంలో వైయస్ఆర్‌సీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులపై కనీసం కేసు నమోదు చేసేందుకు కూడా పోలీసులు ముందుకు రావడం లేదన్నారు. రాష్ట్ర డీజీపీ పచ్చచొక్కా వేసుకుని ఏకపక్షంగా పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు.

ఇంకా ఆయనేమన్నారంటే...

ఏడాది కాలంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన వైనంపై ప్రతిపక్షంగా వైయస్ఆర్‌సీపీ 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' పేరుతో ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. చంద్రబాబు మోసాలను ప్రశ్నించాలని ప్రజలను చైతన్యవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లోనూ మొదటి దశలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశాం. ప్రస్తుతం రెండో దశలో అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. దీనిలో భాగంగా నియోజకవర్గాల్లో పార్టీ ముఖ్య నేతల సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఇదే క్రమంలో గుడివాడ నియోజకవర్గంలో ఈ కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించాం. అయితే ఈ సమావేశానికి రానివ్వకుండా కూటమి ప్రభుత్వం కుట్రలు చేసింది. కృష్ణాజిల్లా పార్టీ అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్యపై బందరు వదిలి రాకూడదంటూ నిర్బంధాలు అమలు చేశారు. బీసీ నాయకురాలు, కృష్ణాజిల్లా ప్రథమ పౌరురాలు ఉప్పాల హారిక గుడివాడకు చేరుకుంటే, ఆమె కారుపై తెలుగుదేశం, జనసేన గుండాలు రెచ్చిపోయి దాడులు చేశారు. కారు అద్దాలు పగులకొట్టారు, ఆమెపై దాడికి ప్రయత్నించారు. ఇది చూస్తుంటే మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామా, నియంతృత్వ పాలనలో ఉన్నామా అనే సందేహం కలుగుతోంది.

పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు

ఒక జిల్లా పరిషత్ చైర్మన్‌కే ఇటువంటి పరిస్థితి ఉంటే, ఇక సామాన్యులకు రక్షణ ఉంటుందా.? కర్రలు, రాళ్ళతో టీడీపీ గూండాలు చేసిన దాడికి గంటసేపు అదే కారులో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఒక మహిళా నేత ఉండాల్సిన పరిస్థితికి ఈ ప్రభుత్వం సిగ్గుపడాలి. చివరికి ఆమె తెగించి, అక్కడే ప్రేక్షకపాత్ర పోషిస్తున్న పోలీసులను ఇదేనా మీరు చేస్తున్న శాంతిభద్రతల బాధ్యత అని ప్రశ్నిస్తే, దానికి సమాధానంగా పోలీసులు 'వారంతా తాగి వచ్చారు, అల్లరి చేస్తున్నారు, మేం మాత్రం ఏం చేస్తాం' అంటూ మాట్లాడటం చూస్తుంటే పోలీస్ వ్యవస్థ ఇంతగా పతనమైందా అనే అనుకోవాల్సి వస్తోంది. పోలీసులు ఏం మాట్లాడారో మొత్తం సోషల్ మీడియాలో ఉన్న వీడియోలు చూస్తే ఎవరికైనా ఇదే భావం కలుగుతుంది. అసాంఘిక శక్తులను అదుపు చేసే సామర్థ్యం పోలీసులకు లేదా? దాడి చేస్తున్న గుండాలను అరెస్ట్ చేయరా? మద్యం, గంజాయి మత్తులో దాడులు చేస్తే, మౌనంగా పోలీసులు నిలబడిపోయారు. ఒక బీసీ మహిళపై పోలీసుల సమక్షంలోనే దాడులు జరుగుతుంటే, రక్షణ కల్పించలేని అసమర్థతతో వ్యవస్థను నడుపుతున్నారా.? వైయస్ఆర్‌సీపీపై పోలీసులను ప్రయోగించడం, మా కార్యకర్తలపై లాఠీలు ఝుళిపించడానికే పోలీసులను పరిమితం చేశారా? పెడనలో జరిగిన 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి కూడా జిల్లా పార్టీ అధ్యక్షుడుగా పేర్ని నాని వెళ్ళకూడదంటూ పోలీసులు ఆంక్షలు విధించారు. ఒక కళ్యాణ మంటపంలో నాలుగు గోడల మధ్య నడిచే మీటింగ్‌లకు కూడా ఆంక్షలు పెడతారా.? చంద్రబాబు, లోకేష్, హోంమంత్రిల ప్రోత్సాహంతోనే పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారు. నెల్లూరులో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిమీద ఇలాగే దాడి చేశారు. ఇంత వరకు దోషులపై కేసు పెట్టలేదు. ఉప్పాల హారికపై దాడి చేసిన వారిపైనా ఇప్పటి వరకు కేసు పెట్టలేదు. వారిపై పోలీసులు కేసు పెడతామంటే మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనితలు అంగీకరించరు. డీజీపీ పచ్చ చొక్కా వేసుకున్నారు. వైయస్ఆర్‌సీపీ నేతలపై జరుగుతున్న ఇటువంటి దాడులపై కనీసం కేసులు కూడా పెట్టడం లేదు. ఏకపక్షంగా పనిచేస్తున్నారు.

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేసిన మోసాలు ప్రతీ ఇంటికి తీసుకెళ్లాలి

మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్

నర్సీపట్నంలో -బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ- కార్యక్రమం

అనకాపల్లి:పెన్ పవర్, జూలై 13 చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేసిన మోసాలు ప్రతీ గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకుని వెళ్ళాలని మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం లో విస్తృత స్థాయి సమావేశం మాజీ శాసనసభ్యులు నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త పెట్ల ఉమశంకర్ గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో గుడివాడ అమర్నాథ్, మాజీ విప్, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త శ్రీ కరణం ధర్మ శ్రీ , అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి , జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ లు, సర్పంచులు, ముఖ్య నాయుకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కౌలు రైతు మరణించడం బాధాకరం

● జగ్గయ్యపేట నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ ఇన్ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు
● కౌలు రైతు తూనం రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన వైయస్ఆర్‌సీపీ నేతలు

ఎన్టీఆర్ జిల్లా: పెన్ పవర్, జూలై 13 వత్సవాయి మండలం, పెంట్యాల వారి గూడెం గ్రామానికి చెందిన కౌలు రైతు తూనం రమేష్ గత రెండు రోజుల క్రితం అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు గారు స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించి, పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ...

కూటమి ప్రభుత్వంలో పంటకు సరైన గిట్టుబాటు ధరలు లేక మరియు రైతులకు ప్రతి సంవత్సరానికి 20వేల రూపాయలు పెట్టుబడి సహాయం ఇస్తా అన్నారు, ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడుస్తున్నా కానీ ఇంతవరకు ఆర్థిక సహాయం అందించలేదు.

రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధరలు లేవు, ఎరువులు రేటు చూస్తేనే ఆకాశాన్ని అందుతున్నాయి, ఇవన్నీ పెనుభారం గా అవ్వటం కారణం చేత రైతులు దిగులు చెంది అప్పుల పాలే ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి కనపడుతుంది.

దేశానికి అన్నం పెట్టే రైతు వెన్నెముక అంటారు నోటి మాటలే తప్ప చేతల్లో చేసింది ఏమీ లేదు. ఈ ప్రభుత్వం.

కౌలు రైతులకి కౌలు కార్డులు సక్రమంగా అందించారని, ఈ సంవత్సరం మిర్చి, పత్తి వేసి రైతులు తీవ్ర అప్పులు పాలయ్యారు, రైతులకు విత్తనాలు ఎరువులు సకాలంలో అందటం లేదు.

చనిపోయిన కౌలు రైతు తూనం రమేష్ గారి కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు.

పండించిన పంట చేతికి రాక నష్టాలపాలయ్యాడు. అయినప్పటికీ ఈ ఏడాది కూడా ఏడెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి సాగు చేపట్టాడు. వరుస నష్టా లతో సుమారు రూ.12 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. గత సోమవారం పొలం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉండాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గూత్తా శంకర్రావు, ఎంపిపి గొలుసు రమాదేవి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబురి రవి, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఏలూరి శివాజీ, జిల్లా కార్యదర్శి రూప్లా నాయక్, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు కనగాల రమేష్, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు నర్మనేని వెంకటేష్, జగ్గయ్యపేట మండల రైతు విభాగా అధ్యక్షులు గూడపాటి శేషయ్య, వత్సవాయి మండలం రైతు విభాగ అధ్యక్షులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, జిల్లా రైతు విభాగ కార్యవర్గ సభ్యులు మోరే దుర్గాప్రసాద్, మాజీ మార్కెట్ డైరెక్టర్ బాలు వీర రాఘవ, గ్రామ సర్పంచ్ వడ్డే పరమయ్య, సీనియర్ నాయకులు కాటేపల్లి రవి, మండల యువజన విభాగ అధ్యక్షులు నగేష్, బాలు రమేష్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాజీ, గ్రామం పార్టీ అధ్యక్షులు మండి శ్రీనివాసరావు, గంగం మేరీ, తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నానిపై కేసు నమోదు

కృష్ణాజిల్లా: పెన్ పవర్, జూలై 13 మాజీ మంత్రి , వైయస్ఆర్‌సీపీ నేత పేర్ని నానిపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగింది. టీడీపీ నేతల ఫిర్యాదులతో పేర్ని నానిపై అక్రమ కేసులు నమోదు చేశారు. ఈ మేరకు మచిలీపట్నం ఆర్ పేట పోలీస్ స్టేషన్‌లో పేర్ని నానిపై కేసులు నమోదు చేశారు. టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు పేర్ని నానిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు పోలీసులు. జీరో ఎఫ్ఐఆర్ కింద పేర్ని నానిపై 353(2), 196(1) సెక్షన్ల కింద కేసులు ఫైల్ చేశారు.

అంతకుముందు పేర్ని నాని ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. మచిలీపట్నంలో పేర్ని నాని ఇంటి వద్ద పోలీసులు మోహరించారు. పెడనలో "బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమానికి వెళ్లనీయకుండా పేర్ని నానిపై పోలీసులు ఆంక్షలు విధించారు. నిన్న(శనివారం) కూడా గుడివాడలో జరిగే కార్యక్రమంలో పాల్గొనివ్వకుండా పోలీసులు నిర్భంధం విధించారు. కూటమి నేతల ఒత్తిడితో వైయస్ఆర్‌సీపీ నేతలపై పోలీసులు ఆంక్షలు పెడుతున్నారు.

పెడన నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంపై ఆంక్షలు విధించిన పోలీసులు.. పెడన ఇంఛార్జి ఉప్పాల రాముకి నోటీసులిచ్చారు. ఇతర నియోజకవర్గాల నాయకులు, బయటి వ్యక్తులు రాకూడదంటూ ఆంక్షలు పెట్టారు.

రైళ్లలో ఇక భద్రతకు పెద్దపీట... చీమ చిటుక్కుమన్నా తెలిసిపోతుంది!

హైదరాబాద్ పెన్ పవర్: ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తూ, రైల్వే శాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న 74,000 రైలు కోచ్‌లలో త్వరలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తలుపుల వద్ద ఈ కెమెరాలు అమర్చనున్నారు. ఈ చర్య ప్రయాణికుల భద్రతను గణనీయంగా మెరుగుపరుస్తుందని, ప్రయాణికులను లక్ష్యంగా చేసుకునే దుండగులు మరియు ముఠాలను నిరోధిస్తుందని అధికారులు భావిస్తున్నారు. నార్తర్న్ రైల్వేలో లోకో ఇంజన్లు మరియు కోచ్‌లలో విజయవంతంగా సీసీటీవీ కెమెరాల ట్రయల్స్ నిర్వహించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. శనివారం జరిగిన ఒక సమావేశంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్నీత్ సింగ్ బిట్టూ మరియు రైల్వే బోర్డు అధికారులు లోకోమోటివ్‌లు మరియు కోచ్‌లలో సీసీటీవీ కెమెరాల ట్రయల్స్ మరియు ఏర్పాటు యొక్క పురోగతిని సమీక్షించారు. ప్రతి రైలు కోచ్‌కు డోమ్ తరహా నాలుగు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ప్రవేశ మార్గంలో రెండు కెమెరాలు ఉంటాయి. అదేవిధంగా, ప్రతి లోకోమోటివ్‌లో ఆరు సీసీటీవీ కెమెరాలు ఉంటాయి. వీటిలో ఒకటి ముందు వైపు, ఒకటి వెనుక వైపు మరియు రెండు వైపులా ఉంటాయి. లోకో యొక్క ప్రతి క్యాబ్‌లో (ముందు మరియు వెనుక) ఒక డోమ్ సీసీటీవీ కెమెరా మరియు రెండు డెస్క్-మౌంటెడ్ మైక్రోఫోన్‌లు అమర్చబడతాయి. గంటకు 100 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించే రైళ్లలో కూడా మరియు తక్కువ వెలుతురు ఉన్న పరిస్థితుల్లో కూడా అధిక-నాణ్యత గల దృశ్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని వైష్ణవ్ రైల్వే అధికారులను కోరారు. ఇండియా ఏఐ మిషన్‌తో భాగస్వామ్యంతో, సీసీటీవీ కెమెరాల ద్వారా సేకరించిన డేటాపై కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగాన్ని అన్వేషించాలని రైల్వే మంత్రి అధికారులను ప్రోత్సహించారు.

భారత్ లోని ఐఫోన్ తయారీ ప్లాంట్ల నుంచి చైనా ఇంజినీర్లు వెళ్లిపోవడంపై కేంద్రం స్పందన

భారత్ లో ఐఫోన్లు తయారు చేస్తున్న ఫాక్స్ కాన్, టాటా ఎలక్ట్రానిక్స్

ఆపిల్ తరపున అసెంబ్లింగ్ కాంట్రాక్టు

తమ ఇంజినీర్లను వెనక్కి పిలిపించిన చైనా

పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామన్న భారత కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్ పెన్ పవర్: భారతదేశంలోని ఆపిల్ ఐఫోన్ల ప్రధాన తయారీదారు అయిన ఫాక్స్‌కాన్ ప్లాంట్ నుంచి చైనా ఇంజనీర్లు తిరిగి వెళ్ళిపోతున్న విషయంపై భారత ప్రభుత్వం తన మౌనాన్ని వీడింది. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని, అయితే ఉత్పత్తి స్థాయిలను నిర్వహించడానికి మరియు పరిస్థితిని అదుపులో ఉంచడానికి ఆపిల్ వద్ద ప్రత్యామ్నాయ ప్రణాళికలు ఉన్నాయని విశ్వాసం వ్యక్తం చేసింది. ఇటీవలి నివేదికల ప్రకారం, ఫాక్స్‌కాన్ భారత ప్లాంట్లలో ఉత్పత్తి లైన్ల నిర్వహణ మరియు శిక్షణలో కీలక పాత్ర పోషించిన వందలాది మంది చైనా సాంకేతిక నిపుణులు తమ దేశానికి తిరిగి వెళ్ళిపోయారు. ఈ నిష్క్రమణ రాబోయే ఐఫోన్ 17 సిరీస్ ఉత్పత్తిపై ప్రభావం చూపవచ్చని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే, ఈ విషయం తమ దృష్టిలో ఉందని, ఏవైనా అంతరాయాలు ఏర్పడితే వాటిని అధిగమించే సామర్థ్యం ఆపిల్‌కు ఉందని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది ప్రధానంగా ఆపిల్ మరియు ఫాక్స్‌కాన్ మధ్య అంతర్గత విషయమని, ఉత్పత్తికి సంబంధించిన లక్ష్యాలను చేరుకోవడంపైనే తమ దృష్టి ఉందని ఒక ప్రభుత్వ అధికారి తెలిపారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకంలో ఫాక్స్‌కాన్ భాగమైనందున, ఉత్పత్తి లక్ష్యాలను అందుకోవడం చాలా ముఖ్యమని ప్రభుత్వం భావిస్తోంది. చైనా కార్మికులకు వీసాలను సులభతరం చేసిన ప్రభుత్వం, ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కంపెనీలను కోరింది.

ఈ మేరకు సవాళ్లు ఉన్నప్పటికీ, ఆపిల్ భారతదేశంలో తన ఐఫోన్ ఉత్పత్తిని పెంచుతోంది. ఈ సంవత్సరం సుమారు 60 మిలియన్ యూనిట్లను తయారు చేయాలని యోచిస్తోంది. చైనా నుంచి విడిభాగాల సేకరణ సులభతరం కావడం మరియు వీసాల విషయంలో ప్రభుత్వ సహాయం ఇందుకు దోహదపడుతున్నాయి. ఈ పెరిగిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి ఫాక్స్‌కాన్ మరియు టాటా ఎలక్ట్రానిక్స్ రెండూ తమ సౌకర్యాలను విస్తరిస్తున్నాయి. ఆపిల్ సీఈఓ టిమ్ కుక్ కూడా భారత తయారీ రంగం యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు, జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించే అన్ని ఐఫోన్లు భారతదేశం నుంచే రవాణా అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఇది భారతదేశ తయారీ సామర్థ్యంపై ఆపిల్‌కు ఉన్న నమ్మకాన్ని సూచిస్తుంది.

వంటింటి మహారాణి ఏఐ



కృత్రిమ మేధ (ఏఐ)... ఎక్కడ చూసినా ఏ రంగంలోనైనా దీని జపమే. నిద్రలేస్తూనే చూసే ఫోన్‌తో మొదలు... నిద్రించే బెడ్ వరకూ ప్రతిదీ ఏఐతోనే పనిచేస్తున్నాయి. ఇప్పుడు ఇంటి, వంటింటి పనుల్లోనూ ఇది కీలకంగా మారనుంది. మరి ఈ డొమెస్టిక్ ఏఐ మహిళలకు ఎంతవరకూ ప్రయోజనం..?

రమ్య సీరియస్‌గా వంట చేస్తోంది. అక్కడికి ఉత్సాహంగా వచ్చిన మోహన్ 'మన పనులన్నీ ఇక నుంచి ఏఐ చేసేస్తుంది' అంటూ ఫోన్‌లో కొన్ని ఫీచర్లు చూపిస్తుంటాడు. 'అయితే ఆ ఏఐ వంట చేస్తుందేమో అడగ%ళి%ండి' అంటుందామె. ఈ రీల్ చేసింది సరదా కోసమైనా, అదే నిజమై మహిళలు వంటింట్లో గడిపే సమయాన్ని ఏఐ తగ్గించగలిగితే దేశ జీడీపీ గ్రాఫ్ అమాంతం పెరగడం ఖాయం. పిల్లలకీ భర్తకీ అత్తమామలకీ అందరికీ బ్రేక్‌ఫాస్ట్, లంచ్‌తో సహా అన్నీ రెడీ చేసి ఆఫీసుకు పరుగులు. వచ్చాక మళ్లీ వంట, హోమ్‌వర్క్‌లు, పెద్దవాళ్ల బాగోగులు చూడటంతో నేటి మహిళ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ పరిస్థితిలో ఆమె తన శక్తిసామర్థ్యాలను ఉత్పాదకత వైపునకు మళ్లించాలంటే వంటింట్లో గడిపే సమయం తగ్గాల్సిందే. ఎందుకంటే సమానత్వం, సాధికారత అంటూ ఎంతగా పోరాడినా... ఆడవాళ్లకు ఇంటి పని, వంట పని ఎటూ తప్పడం లేదు. పిల్లల బాధ్యత సరేసరి. ఏఐ సహకారంతో ఆ పనుల్ని కొంతైనా తగ్గించుకుంటే ఆర్థిక దిశగా అడుగులేయొచ్చు అంటున్నారు నిపుణులు.

నిజానికి పదేళ్ల క్రితమే లండన్‌కు చెందిన మోలీ రోబోటిక్స్ ఇంటికోసం రోబో కిచెన్‌లను రూపొందించింది. ఈ రకమైన రోబో షెఫ్‌ల్నీ, రోబోటిక్ వ్యాక్యూమ్ క్లీనర్లనీ అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికే వాడుతున్నారు. ఇవన్నీ కొంతమేర పనుల్ని సులభతరం చేస్తున్నాయి. కానీ మనిషి ప్రమేయం పూర్తిగా ఉండదని చెప్పలేం. వంటకు కావాల్సినవి సిద్ధం చేయడం, శుభ్రం చేయడం... వంటివి మనమే చేయాలి. సాంకేతికత పనుల్ని సులభతరం చేస్తుందే తప్ప, పూర్తిగా చేయలేదు. అలాగని ఏఐ అప్లయెన్సెస్‌ని పక్కన పెట్టలేం. అందుకే గ్లోబల్ బ్రాండ్లైన ఎల్‌జీ, శామ్‌సంగ్, హెయర్... వంటి కంపెనీలు సైతం ఏఐ ఉపకరణాల బాట పడుతున్నాయి. ప్రస్తుతం ఈ రకమైన స్మార్ట్ కిచెన్‌లు లగ్జరీ ఇళ్లకే పరిమితం. కానీ నోష్, అప్లయన్స్... వంటి దేశీ స్టార్టప్‌లూ వీటిని రూపొందించడంతో ధరలు అందుబాటులోకి రావచ్చు. అలా వంటింట్లోకి వచ్చిన, వస్తోన్న కొన్ని ఏఐ ఉపకరణాలు...

కుకింగ్ అసిస్టెంట్స్

మిక్సర్, ప్రెషర్ కుక్కర్లతో పనిలేకుండా చేస్తాయివి. 'అప్లయన్స్' సంస్థ రూపొందించిన ఏఐ అసిస్టెంట్... దాని రెసిపీ లైబ్రరీ నుంచి 500 రకాలను కోరిన రుచుల్లో వండేస్తుందట. కావాల్సిన వంటను ఎంపిక చేసుకుని అవసరమైన పదార్థాలను వేస్తే చాలు. వంటకాన్ని బట్టి కోయడం, కల పడం, గ్రైండ్ చేసుకోవడం, ఉడికించడం... దాదాపు 16రకాల పనుల్ని చేస్తుందీ పరికరం. దీన్ని శుభ్రం చేయడమూ తేలికేనట. ఇదొక్కటే కాదు, వండర్‌షెఫ్, షావోమీ, నోష్... ఇలా వంట చేసే లేదా తోడ్పడే అసిస్టెంట్స్ చాలానే వస్తున్నాయి.

సౌలభ్యమే ఈ ఏఐ రోబోల విజయం. వంట మొదలుపెట్టి అక్కడే ఉండాల్సిన పని లేదు. ఇతర పనులూ చేసుకోవచ్చు. కూర మాడుతుందనో గ్యాస్ కట్టాలనో టెన్షన్ ఉండదు. కొన్నాళ్లకు వీటిల్లోని కృత్రిమ మేధ మీ రుచుల్నీ ఇష్టాల్నీ గమనించి వంట పూర్తి చేస్తుంది. అప్పుడు అచ్చం మీరు చేసినట్లే అవీ చేస్తాయట. ఈ ఆల్ ఇన్ వన్ మెషీన్లతో సమయంతోపాటు స్థలం, ఇంధనం అన్నీ ఆదానే.

అవెన్లు, ఇండక్షన్ కుక్‌టాప్‌లు: ఏం వండుతున్నామో సెన్సర్ల ద్వారా గుర్తించి వాటికవే ఉష్ణోగ్రతనీ వంట సమయాన్నీ సర్దుబాటు చేసుకుంటాయి. మన జోక్యాన్ని తగ్గిస్తాయి.

స్మార్ట్ రిఫ్రిజిరేటర్లు: ఏఐ విజన్ ఇన్‌సైడ్ ద్వారా పనిచేసే ఈ రకం ఫ్రిజ్‌ల్ని ఆప్ ద్వారా ఫోన్‌కి కనెక్ట్ చేసుకుంటే గడువు తేదీలను చెక్ చేసి ఏవి ఎప్పుడు వండాలో చెబుతాయి. అయిపోయేవాటి గురించీ హెచ్చరిస్తాయి. తలుపు తెరవడం, మూయడం చేసినప్పుడు

వాటంతటవే కూలింగ్‌ను సరిచేసుకుని ఆహార వృథానీ కరెంట్ బిల్లునీ తగ్గిస్తాయి.

ఎయిర్ ఫ్రయర్లు: ఇందులోని ఏఐ సెన్సర్లు పదార్థం, బరువుని బట్టి దానంతటదే ఉష్ణోగ్రతను సెట్ చేసుకుని వడియాలు, చిప్స్, టిక్కీలు... వంటివి నూనె లేకుండానే తయారుచేసి ఆరోగ్యాన్ని రక్షిస్తాయి.

ఇవే కాదు, ఆటోమేటిక్ మల్టీ కుక్కర్లు, కాఫీ మేకర్లు, లాండ్రీ ఫోల్డింగ్స్ మెషీన్లు, ఫ్యాబ్రిక్‌ను గుర్తించి ఉతికే వాషింగ్ మెషీన్లు, సెల్ఫ్ క్లీనింగ్ అవెన్లు, వాయిస్ కమాండ్‌తోనే తెరచుకునే డిష్ వాషర్లు... ఇలా ఏఐ సాయంతో పనిచేసే ఉపకరణాలెన్నో వస్తున్నాయి. చేతికి పని లేకుండా మోషన్ సెన్సర్ల ద్వారా లైట్లు, అవెన్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ అయ్యేవీ ఉన్నాయి. అంతేనా, మున్ముందు మనకెలాంటి శ్రమా లేకుండా వంటకు కావాల్సిన వస్తువుల్ని సైతం వాటంతటవే యాప్‌లో కొనుగోలు చేసే డిజిటలైజ్డ్ స్మార్ట్ కిచెన్‌లూ రావొచ్చు. 'ఏమో, గుర్రం ఎగరావచ్చు' అన్నట్లు అప్పుడు కృత్రిమ మేధే వంటింటి మహారాణి... ఏది పెడితే అది తినాల్సిందేనేమో!

వాడడమే కాదు.. వీటిని రోజూ శుభ్రం చేయాలట!

వంటింట్లో రోజూ ఎన్నో వస్తువులు ఉపయోగిస్తుంటాం.. కానీ వాటిలో అన్నీ శుభ్రం చేయం.. చేసే వస్తువుల్నీ ఏదో అలా పైపైన క్లీన్ చేసి వదిలేస్తుంటాం. నిజానికి దీనివల్ల వాటిపై ఆహారపు అవశేషాలు ఉండిపోయి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుందంటున్నారు నిపుణులు. అలా జరగకుండా ఉండాలంటే.. రోజూ ఉపయోగించే వస్తువుల్ని సరైన పద్ధతిలో శుభ్రం చేయడం ముఖ్యమంటున్నారు. అదెలాగో తెలుసుకుందాం రండి..

బ్లెండర్ గ్యాస్కెట్స్

చట్నీ, జ్యూస్.. అంటూ రోజూ మిక్సీ జార్లు, బ్లెండర్/జ్యూసర్.. వంటివి ఉపయోగిస్తుంటాం. వాడకం పూర్తయ్యాక వీటిని శుభ్రం చేసినా.. ఈ మూతలకు ఉండే గ్యాస్కెట్లు/రబ్బర్ వాచర్లు వేరు చేసి కడిగే వారు చాలా తక్కువ మంది ఉంటారు. ఇది బిగుతుగానే ఉంది కదా.. దీని లోనికి పదార్థాలు దూరవని అనుకుంటారు. కానీ జ్యూసులు వంటి ద్రవ పదార్థాలు ఇందులోకి చేరి.. కడిగినా అవి పూర్తిగా తొలగిపోవు. తద్వారా బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీన్ని ఇలాగే ఉపయోగిస్తే లేనిపోని అనారోగ్యాలు చుట్టుముడతాయి. అందుకే వీటిని ఉపయోగించిన ప్రతిసారీ గ్యాస్కెట్లు/రబ్బర్ వాచర్లు వేరు చేసి శుభ్రం చేయడం మంచిదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో గోరువెచ్చటి సబ్బు నీటిలో వీటిని కాసేపు ఉంచి.. ఆపై స్క్రబ్బర్‌తో రుద్ది శుభ్రం చేస్తే అవి పూర్తిగా శుభ్రపడతాయంటున్నారు.

సిలికాన్ స్పాచులా

బేకింగ్, గ్రీజింగ్ కోసం సిలికాన్‌తో తయారుచేసిన స్పూన్లు/స్పాచులాస్/బ్రష్‌లు ఉపయోగించడం పరిపాటే! అయితే వీటిపై కంటికి కనిపించని రంధ్రాలుంటాయి. వీటితో ఆయా పదార్థాల్ని కలిపినప్పుడు వాటి అవశేషాలు ఈ రంధ్రాల్లోకి చేరతాయి. కాబట్టి వీటిని పైపైన అలా కడిగేయడం కాకుండా ప్రత్యేకంగా శుభ్రం చేయడం మంచిదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో గోరువెచ్చటి సబ్బు నీటిలో వీటిని కాసేపు ఉంచి శుభ్రం చేయడంతో పాటు వారానికోసారి బ్లీచ్ మిశ్రమంలో కాసేపు ఉంచి క్లీన్ చేస్తే వాటిపై చేరిన పదార్థాల అవశేషాలు లోలోపలి నుంచి తొలగిపోతాయి. తద్వారా వాటిపై బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా జాగ్రత్తపడచ్చు.

క్యాన్ ఓపెనర్స్

కిచెన్‌లో తరచూ ఉపయోగించే వస్తువుల్లో క్యాన్ ఓపెనర్స్ ఒకటి. ఆయా జార్ల మూతల్ని సులభంగా తీయడానికి, వాటిపై ఉండే అల్యూమినియం మూతల్ని కట్ చేయడానికి వీటిని ఉపయోగిస్తాం. అయితే వీటి వాడకం పూర్తయ్యాక అలాగే పక్కన పెట్టేయడం చాలామందికి అలవాటు! ఇక కొంతమందేమో వీటిని అలా పైపైన తుడిచేస్తుంటారు. కానీ కొన్నిసార్లు మూత తెరిచే క్రమంలో ఈ ఓపెనర్‌కి ఉన్న బ్లేడ్స్‌కి జార్‌లోని పదార్థాల అవశేషాలు అంటుకునే అవకాశం ఉంటుంది. పైపైన తుడిచినా అవి తొలగిపోవు కాబట్టి వాడిన ప్రతిసారీ తడిగుడ్డతో శుభ్రంగా తుడవాల్సి ఉంటుంది. కొన్ని రోజులకోసారి సబ్బు నీటితో కడిగితే అవి పూర్తిగా శుభ్రపడతాయి. ఫలితంగా వాటిపై బ్యాక్టీరియా పెరగకుండా ఉంటుంది.

చాపింగ్ బోర్డులు

కాయగూరల్ని కట్ చేసే చాపింగ్ బోర్డుల్ని వాడిన ప్రతిసారీ కుళాయి కింద అలా పైపైన శుభ్రం చేయడం చాలామంది చేసేదే! అయితే దీనివల్ల అవి పూర్తిగా శుభ్రపడవు. తద్వారా వాటిపై బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. అంతేకాదు.. కొంతమంది కాయగూరలు, పచ్చి మాంసం కట్ చేయడానికి ఒకే చాపింగ్ బోర్డును ఉపయోగిస్తుంటారు. ఇది కూడా ప్రమాదకరమే! కాబట్టి కాయగూరలు, మాంసానికి వేర్వేరు కటింగ్ బోర్డులు ఉపయోగించడంతో పాటు.. వీటిని రోజూ సబ్బు నీటితో శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఇక అప్పుడప్పుడూ బ్లీచ్ మిశ్రమంతో వీటిని కడిగేస్తే మంచిదంటున్నారు నిపుణులు.

హ్యాండిల్స్.. ఇలా!

ఫ్రిజ్, అవెన్.. వంటి వస్తువుల లోపలి భాగాల్ని శుభ్రంగా ఉంచుకుంటాం.. కానీ వాటి హ్యాండిల్స్‌ని మాత్రం అంతగా పట్టించుకోం. అలాగే స్టౌ నాబ్స్ విషయంలోనూ ఇలాగే నిర్లక్ష్యం చేస్తుంటాం. తడి, పొడి, జిడ్డుగా ఉన్న చేతులతో హ్యాండిల్స్, నాబ్స్‌ని పట్టుకోవడం వల్ల అవి మరింత జిడ్డుగా, మురికిగా తయారవుతాయి. తద్వారా వాతావరణంలోని బ్యాక్టీరియా, క్రిములు వీటిపైకి చేరతాయి. అందుకే వీటిని తరచూ శుభ్రం చేయాలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో యాంటీ మైక్రోబియల్ క్లీనింగ్ ద్రావణాల్ని ఉపయోగించడం వల్ల వాటిపై ఉండే మురికి, జిడ్డుదనం తొలగిపోయి పూర్తిగా శుభ్రపడతాయి.

ఇవి కూడా!

గిన్నెలు తోమే స్క్రబ్బర్లు/స్పాంజిలను ప్రత్యేకంగా శుభ్రం చేయాల్సిన పని లేదనుకుంటారు చాలామంది. కానీ టాయిలెట్ సీట్ కంటే వీటిపై రెండు లక్షల రెట్లు అధిక బ్యాక్టీరియా ఉంటుందని ఓ అధ్యయనం చెబుతోంది. అందుకే వీటిని శుభ్రం చేసేందుకు రోజుకోసారి ఓ రెండు నిమిషాల పాటు అవెన్‌లో అధిక ఉష్ణోగ్రత వద్ద ఉంచాలంటున్నారు నిపుణులు. తద్వారా 99 శాతం సూక్ష్మక్రిములు చనిపోతాయట!

ఇక కిచెన్ కుళాయిలు ఎప్పుడూ తడిగానే ఉంటాయి. అలాగే వాడే క్రమంలో మన చేతులకు ఉండే మురికి, జిడ్డు వాటిపైకి చేరుతుంది. కాబట్టి వాటిని ఎప్పటికప్పుడు వెనిగర్, నీళ్లు కలిపిన ద్రావణంతో శుభ్రం చేయాలి.

అలాగే కిచెన్ టవల్స్, డిష్ క్లాత్స్‌ని కూడా రోజూ మార్చుతుండాలి. వీటిని బ్లీచ్ ద్రావణంలో నానబెట్టి ఉతికితే శుభ్రపడతాయి.

లాకప్ డెత్ పై రంగంలోకి విజయ్... స్టాలిన్ సర్కార్ పై ఫైర్!

హైదరాబాద్ పెన్ పవర్: తమిళనాడులో అజిత్ కుమార్ అనే సెక్యూరిటీ గార్డు లాకప్ డెత్ ఇష్యూ తీవ్ర సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ విషయం స్టాలిన్ సర్కార్ కి పెను సమస్యగా మారిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ ఘటనపై భారీ నిరసన కార్యక్రమం నిర్వహించగా... దానిలో విజయ్ నల్ల చొక్కా ధరించి ఎంట్రీ ఇచ్చారు. సర్కార్ పై విరుచుకుపడ్డారు. అవును... తమిళనాడులో సెక్యూరిటీ గార్డు అజిత్ కుమార్ లాకప్ డెత్ ఇష్యూ తీవ్ర సంచలనంగా మారిన వేళ.. తాజాగా దీనిపై భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'తమిళగ వెట్రి కళగం' పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా... 'రాష్ట్రం నుంచి తమకు కావాల్సింది సారీ కాదు, న్యాయం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా చెన్నైలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నల్ల చొక్కా ధరించి పాల్గొన్న విజయ్.. 'సారీ కాదు, మాకు న్యాయం కావాలి' అని రాసున్న ప్లకార్డును ప్రదర్శించారు. ప్రభుత్వం నుంచి ఎక్కువగా సారీ అనే సమాధానమే వస్తోంది.. అన్నా యూనివర్సిటీ కేసు నుంచి అజిత్ కుమార్ కేసు వరకు.. ఇంకా ఎన్ని దారుణాలు చూడాలని ప్రశ్నించారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన పలు దారుణాలపై కోర్టులే జోక్యం చేసుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయని చెప్పిన విజయ్... 'అలాంటప్పుడు మీ పాలనతో మాకేం అవసరం?'.. ముఖ్యమంత్రితో ఏం అవసరం? అంటూ ఫైర్ అయ్యారు. సెక్యూరిటీ గార్డు అజిత్ కుమార్ పేద కుటుంబం నుంచి వచ్చిన యువకుడని టీవీకే విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా... ఈ ఘటన అనంతరం సీఎం సారీ చెప్పారని.. ఈ ప్రభుత్వ హయాంలో మొత్తం 24 మంది కస్టడీలో మరణించారని.. వారందరికీ కూడా క్షమాపణలు చెప్పాలని.. అజిత్ కుటుంబానికి ఇచ్చినట్లే ఆ బాధిత కుటుంబాలకు కూడా పరిహారం ఇవ్వాలని ఈ సందర్భంగా స్టాలిన్ ప్రభుత్వాన్ని విజయ్ డిమాండ్ చేశారు. కాగా... భద్రకాళియమ్మన్ ఆలయానికి ఇటీవల వచ్చిన ఇద్దరు మహిళా భక్తుల నగలు అపహరణకు గురవ్వగా.. ఈ కేసులో ఆ ఆలయ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న అజిత్ కుమార్ తో సహా పలువురిని పోలీసులు విచారించారు. ఈ క్రమంలో అజిత్ ను చిత్రహింసలకు గురిచేసినట్లు తెలిసింది. దీంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు! ఈ క్రమంలో... అజిత్ కుమార్ ఒంటిపై 44 గాయాలున్నట్లు పోస్టు మార్టం నివేదికలో వెల్లడైంది. దీంతో కస్టడీలో ఉన్నప్పుడు అతడు తీవ్రమైన హింసకు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. ఇందులో భాగంగా... గుండె, కాలేయం వంటి అంతర్గత భాగాల్లో తీవ్ర రక్తస్రావం అయినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ విచారిస్తోంది.

పేర్ని నాని ఆడియో కాల్ లీక్ రచ్చ... మొదలైపోయిన యాక్షన్!

హైదరాబాద్ పెన్ పవర్: తాజాగా గుడివాడలో జరిగిన ఘటనల్లో వైసీపీ కుట్ర బట్టబయలయ్యిందనే చర్చ ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... కూటమి, వైసీపీ నేతల మధ్య గొడవకు కాస్తా కులం రంగు పులమాలని, దానిపై రాష్ట్ర వ్యాప్తంగా గొడవలు సృష్టించాలనే మాజీ మంత్రి పేర్ని నాని ఫోన్ సంభాషణ ఇప్పుడు వైరల్ అవ్వగా.. సర్కార్ యాక్షన్ స్టార్ట్ అయ్యింది! అవును... బీసీ మహిళపై దాడి జరిగిందంటూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని.. పై నుంచి లోకేష్ చెప్పటంతో గుడివాడ టీడీపీ ఎమ్మెల్యే, అతని అనుచరులు దాడి చేశారని ప్రచారం చేద్దాం అంటూ పేర్ని నాని ఆడియో కాల్ విత్ వీడియో షాట్ బయటకు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో.. టీడీపీ శ్రేణులతో మాజీ మంత్రిపై కేసు నమోదైంది. అసలేం జరిగిందంటే... నాగవరప్పాడు కె కన్వెన్షన్ లో మాజీ మంత్రి కొడాలి నాని 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' పేరుతో పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన కృష్ణా జిల్లా జడ్పీ ఛైర్మన్ హారిక కారును టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆమెను వెనక్కి తిరిగి వెళ్లిపోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ శ్రేణులు వాహనాన్ని ధ్వంసం చేశారు! ఈ సమయంలో... కె కన్వెన్షన్ వైపు కారు వెళ్లకుండా టీడీపీ కార్యకర్తలు అడ్డుగా నిలిచారు. దీంతో పోలీసులు రంగం ప్రవేశం చేసి అతి కష్టంమీద హారిక కారును వెనక్కి పంపించారు. ఈ విషయం వైసీపీ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం రేకెత్తించింది. వారంతా కె కన్వెన్షన్ నుంచి బయటకొచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో.. అక్కడే ఉన్న డీఎస్పీ నేతృత్వంలోని పోలీసులు వారు బయటకు రాకుండా నిలువరించారు. మరోవైపు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో నాగవరప్పాడు సెంటర్ లో భారీగా పోలీసులను మోహరించారు. ఇదే సమయంలో... పేర్ని నాని వస్తారనే సమాచారంతో టీడీపీ కార్యకర్తలు కె కన్వెన్షన్ కు వెళ్లే మార్గంలో ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో పేర్ని నాని తన పర్యటనను విరమించుకున్నారు. అనంతరం... మచిలీపట్నంలోని తన నివాసంలోనే ఆయన ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలోనే బీసీ మహిళపై దాడి జరిగిందంటూ రాష్ట్రవ్యాప్తంగా అందరితో కలిసి ఆందోళన చేయాలని సలహా ఇచ్చారు! పైనుంచి లోకేష్ డైరెక్షన్ లో గుడివాడ ఎమ్మెల్యే రాము.. బీసీ మహిళపై దాడి చేయించాడనే విషయాన్ని ఆందోళన చేస్తే బాగుంటుందని అన్నారు! దీంతో.. పేర్ని నానిపై కేసు నమోదైంది!

కొత్త టెన్షన్!... నోయిడా రూల్ అమరావతి విమానాశ్రయానికి అప్లై అయితే..?

హైదరాబాద్ పెన్ పవర్: సాధారణంగా... ఎక్కడైనా 'విమానాశ్రయ నిర్మాణం' అనే ప్రకటన వెలువడితే.. వెంటనే అక్కడ రియల్ ఎస్టేట్ బూమ్ స్టార్ట్ అయిపోతుందని అంటారు. రియల్ ఎస్టేట్ సంస్థల ప్రకటనలు కూడా... విమానాశ్రయానికి అత్యంత సమీపంలో.. ఎయిర్ పోర్ట్ కు కేవలం 2 కి.మీ. దూరంలో అద్భుతమైన అపార్ట్మెంట్స్ అని ప్రకటనలు కనిపిస్తుంటాయి. అయితే ఇకపై అలాంటివి కనిపించే అవకాశం లేదనే చర్చ తెరపైకి వచ్చింది. మరి.. అమరావతి విమానాశ్రయ పరిస్థితి ఏమిటి? అవును... నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం భవిష్యత్తు కార్యకలాపాలను సురక్షితంగా ఉంచడానికి... ప్రతిష్టాత్మక విమానాశ్రయం చుట్టూ 10 కిలోమీటర్ల జోన్ లో అన్ని కొత్త నిర్మాణాలను స్థానిక అధికారులు తాజాగా నిలిపివేశారు. విమానాలు, విమానాశ్రయ కార్యకలాపాలకు ప్రమాదాలు కలగకుండా.. నియంత్రణ లేని భవనాలను నిరోధించడానికి అధికారులు చేసే కృషిలో భాగంగా ఈ నిర్ణయాత్మక చర్య అని చెబుతున్నారు. విమానాశ్రయ సమీపంలో అనుమతి లేని, వేగవంతమైన భవనాల గురించి పెరుగుతున్న ఆందోళనలే దీనికి కారణం అని అంటున్నారు. నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లిమిటెడ్ (ఎన్ఐఏఎల్), గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా పరిపాలన అధికారులు ఈ విషయంలో చాలా స్ట్రిక్ట్ గా ఉంటున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా... విమానాశ్రయం చుట్టూ ఉన్న ఆకాశం వచ్చే, వెళ్లే అన్ని విమానాలకు స్పష్టంగా, సురక్షితంగా ఉండేలా చూడటం తమ లక్ష్యం అని అంటున్నారు. ఇటీవల జరిగిన విమానాశ్రయ పర్యావరణ నిర్వహణ కమిటీ (ఏఈఎంసీ) సమావేశంలో.. నియంత్రణ లేని అభివృద్ధి వల్ల కలిగే అనేక ప్రమాదాలు వెలుగులోకి వచ్చాయని అంటున్నారు. ఈ సమయంలో విమానాశ్రయానికి 10 కి.మీ. చుట్టుపక్కల నిర్మాణాలు ఉండకుండా చూడటంతో పాటు విమానాశ్రయ సమీపంలో లేజర్, డ్రోన్ల వాడకం వంటి కార్యకలాపాలపై గట్టి నియంత్రణ ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయబడ్డాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే.. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటికే నిర్మాణంలో ఉన్న భోగాపురం, రాబోయే అమరావతి విమానాశ్రయాల వద్ద పరిస్థితి ఏమిటి? నోయిడా విమాశ్రయం విషయంలో తీసుకున్న ఈ 10 కి.మీ నిబంధనను అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలకు వర్తింపజేస్తే.. భోగాపురం, అమరావతి చుట్టూ ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్ల పరిస్థితి ఏమిటి? ఈ విషయాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారబోతున్నాయని అంటున్నారు! ఈ లెక్కన చూసుకుంటే శంషాబాద్ విమానాశ్రయం, ముంబై, చెన్నై, బెంగళూరు మొదలైన నగరాల్లోని ఇతర విమానాశ్రయాల చుట్టూ ఇప్పటికే ఉన్న అనేక నివాస, వాణిజ్య భవనాల పరిస్థితి ఏమిటనే చర్చ తెరపైకి వచ్చిందని అంటున్నారు. అయితే.. ఇప్పటికే పనిచేస్తున్న విమానాశ్రయాలకు ఈ రూల్ వర్తించదని అంటున్నారని తెలుస్తోంది. కాకపోతే కొత్తగా నిర్మించబోయే, నిర్మాణంలో ఉన్న అన్ని విమానాశ్రయాలకు ఈ 10 కి.మీ నిర్మాణ నిషేధం అమలు చేయబడే అవకాశం ఉందని అంటున్నారు!

తీన్మార్ మల్లన్న ఆఫీసుపై దాడి.. గన్ మెన్ కాల్పులు.. ఏం జరిగింది?

హైదరాబాద్ పెన్ పవర్: ప్రత్యర్థుల ఇళ్లు, కార్యాలయాలపై దాడుల సంస్కృతి పెరుగుతున్నట్లుగా కనిపిస్తోంది. ఈ క్రమంలో తాజాగా మేడిపల్లిలోని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆఫీసుపై దాడి జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ దాడికి దిగారు! కవిత చేస్తున్న బీసీ ఉద్యమాన్ని మల్లన్న తప్పుబడుతూ వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవును... ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి జరిగింది. ఇందులో భాగంగా.. ఆయన కార్యాలయంలోని ఫర్నిచర్, కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారులను అడ్డుకునేందుకు తీన్మార్ మల్లన్న గన్ మెన్ గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. మరోవైపు పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ఆందోళనకారులను అదుపు చేశారు. దాడి జరిగిన సమయంలో మల్లన్న ఆఫీసులోనే ఉన్నారు. ఈ సమయంలో కార్యాలయంలోని గదిలో ఉంచి మల్లన్నకు గన్ మెన్లు రక్షణ కల్పించారు. ఆ సమయంలో జాగృతి కార్యకర్తలు భారీగా ఆఫీసులోకి చొచ్చుకురావటంతో పరిస్థితి అదుపుతప్పిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే మల్లన్న గన్ మెన్ ఐదు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారని తెలుస్తోంది. ఈ సమయంలో ఆఫీసులోని అద్దాలు ధ్వంసం కావటంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారని తెలుస్తోంది. ఈ సమయంలో ఎమ్మెల్సీ మల్లన్న చేతికి కూడా స్వల్పంగా గాయమైందని సమాచారం. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితిని పోలీసులు అదుపులోకి తీసుకొచ్చారు. మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో ఈ దాడి జరిగినట్లు చెబుతున్నారు. కాగా... ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం బీసీ ఉద్యమాన్ని తెరపైకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే! ఇందులో భాగంగా... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అయితే... కవిత చర్యలను తప్పుబడుతూ తీన్మార్ మల్లన్న తన యూట్యూబ్ లో పలు అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఈ వ్యాఖ్యలే జాగృతి కార్యకర్తల ఆగ్రహానికి కారణమయ్యాయని తెలుస్తోంది!

అమరావతిలో సింగపూర్... చంద్రబాబు లేటెస్ట్ (టూర్) ప్లాన్ ఇదే!

హైదరాబాద్ పెన్ పవర్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, సింగపూర్ కు ఓ ప్రత్యేక అనుబంధం ఉందని అంటారు. ప్రధానంగా ఏపీ రాజధాని అమరావతిని సింగపూర్ తరహాలో తీర్చిదిద్దాలని బాబు భావిస్తుంటారని చెబుతుంటారు. ఈ క్రమంలోనే 2014-19 కాలంలో రాజధాని అమరావతిగా ఖరారు అయిన తరువాత మాస్టర్ ప్లాన్ తో పాటుగా సింగపూర్ కన్సల్టెన్సీలు కీలక పాత్ర పోషించాయి! ఈ సమయంలో అప్పటి సింగపూర్ మంత్రి ఈశ్వరన్ పలు సందర్భాల్లో ఆంధ్రప్రదేశ్ లో పర్యటించారు. ఇదే క్రమంలో... చంద్రబాబు %c% కో అప్పట్లో సింగపూర్ ను పలు మార్లు సందర్శించారు. ప్రధానంగా అమరావతి రాజధాని వ్యవహారాల్లో సింగపూర్ టీం కీలకంగా వ్యవహరించిందని అంటారు! ఈ సమయంలో మళ్లీ అధికారంలోకి వచ్చిన బాబు సింగపూర్ వెళ్తున్నారు. అవును... ఈ దఫా అమరావతిని ఆంధ్రులు గర్వించే స్థాయిలో ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని కంకణం కట్టుకున్న చంద్రబాబు... ఆ దిశగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అవిరామంగా శ్రమిస్తున్నారు. ఈ సమయంలో తాజాగా సింగపూర్ టూర్ ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా.. ఈ నెల 26 నుంచి ఐదు రోజుల పాటు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటుగా మంత్రులు లోకేష్, నారాయణ, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్ వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ఏపీకి సంబంధించి పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుపై చర్చ చేస్తారని తెలుస్తోంది. ఈ సమయంలో... రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ తో పాటు ఇతర అంశాలపైనా చర్చించే అవకాశం ఉందని సమాచారం!

అక్కడ పోటీకి టీడీపీ దూరం ?

హైదరాబాద్ పెన్ పవర్: తెలుగుదేశం పార్టీ విషయానికి వస్తే తెలుగు నాట ఏ పార్టీకి లేని చరిత్ర ఉంది. ఉమ్మడి ఏపీని ఏకంగా 18 ఏళ్ళ పాటు ఏలిన చరిత్ర టీడీపీది. ఎన్నికల రాజకీయాల్లో ఎన్నిన్ని మెరుపు షాట్లు కొట్టిందో టీడీపీకే తెలుసు. రాజకీయంలో వేగం దూకుడు అన్నవి ఆ పార్టీ నుంచే వచ్చాయి. 1983లో హైదరాబాద్ లో టీడీపీ పుట్టింది. తెలంగాణలో పుట్టి అక్కడ ఈ రోజుకీ గ్రాస్ రూట్ లెవెల్ లో అంతో ఇంతో బలం ఉన్న టీడీపీ ఇపుడు ఒక సంచలన నిర్ణయం తీసుకోబోతుందా అన్న చర్చ సాగుతోంది.
ఏపీలో బలమైన పార్టీగా మరింతగా మారుతోంది. మరో నాలుగు దశాబ్దాలకు తగిన విధంగా తన రూపురేఖలను మార్చుకుంటోంది. కొత్త నీరును చేరుస్తోంది. అన్ని రకాలుగా టీడీపీ ఏపీలో పరిపుష్టం అవుతోంది. దానికి 2024 ఎన్నికలు ఇచ్చిన బూస్టింగ్ వేరే లెవెల్ అని చెప్పాల్సిన పని లేదు. అయితే ఏపీలో అధికారంలోకి వచ్చిన ఆ సందర్భంలోనే తెలంగాణాలోనూ టీడీపీ మళ్ళీ తన జెండాను గర్వంగా ఎగరేస్తుందని అంతా భావించారు. టీడీపీ అధినాయకత్వం కూడా మొదట్లో ఆ దిశగా సంకేతాలు ఇచ్చింది. అంతే కాదు పార్టీని తెలంగాణాలోనూ విస్తరిస్తామని చంద్రబాబు కూడా ముఖ్యమంత్రి హోదాలో హాజరైన సభలో చెప్పారు. కానీ కాలం గడుస్తున్న కొద్దీ అలాంటి సూచనలు ఏవీ లేకుండా పోతున్నాయి. తెలంగాణాలో టీడీపీ అయితే హైదరాబాద్ లో జూబ్లీ హిల్స్ లాంటి చోట కొంత పట్టు కలిగి ఉంది. అలాగే ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్ నగర్ వంటి చోట్ల అక్కడక్కడ కొంత పట్టు కలిగి ఉంది. అయితే బీఆర్ఎస్ ఓడిన నేపథ్యంలో మొదట్లో టీడీపీ రీ ఎంట్రీకి ఇది సరైన సందర్భం అని అంతా అనుకున్నారు. ఎందుకంటే బీఆర్ఎస్ లో ఉన్న వారిలో అధికులు టీడీపీకి చెందిన వారే కాబట్టి. అయితే టీడీపీకి ఆంధ్రా పార్టీ అన్న ముద్ర ఉంది. పైగా ఏపీ సీఎం గా బాబు ఉన్నారు. దాంతో ఏపీ ప్రయోజనాల కోసం మాట్లాడిన ప్రతిసారి ఆయనను ఆంధ్ర పక్షపాతిగానే చూపిస్తారు. మరో వైపు చూస్తే బలమైన నాయకత్వం కనుక ఉంటే 2028 ఎన్నికల వేళకు బీజేపీతో జనసేనతో పొత్తు పెట్టుకుని తెలంగాణాలోనూ కూటమి కట్టి అధికారంలో భాగం పంచుకోవచ్చు అని అనుకున్నారు. కానీ తెలంగాణ బీజేపీ అయితే టీడీపీతో పొత్తు పెట్టుకోవడానికి అంత సుముఖంగా లేదని అంటున్నారు. ఎప్పటిలాగే పొత్తులు పెట్టుకుంటారో అది బీఆర్ఎస్ కి అంది వచ్చిన అస్త్రం అవుతుందని దాంతో తెలంగాణాలో బీజేపీకి అనుకూలత బాగా తగ్గిపోతుందని కమలనాథులు చింత పడుతున్నారు. దాంతో టీడీపీ విషయంలో మొహమాటం లేకుండా వారు నో చెప్పేస్తున్నారు అని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే జమిలి ఎన్నికలు వస్తాయని అంటున్న నేపథ్యంలో ఒకేసారి ఏపీ తెలంగాణాలలో ఎన్నికలు జరిగితే అక్కడ తెలంగాణాను అనుకూలంగా మాట్లాడితే ఏపీలో అసలుకే ఎసరు వస్తుందని ఇదంతా ఎందుకొచ్చిన తంటా అని భావిస్తున్న టీడీపీ పెద్దలు తెలంగాణాలో పార్టీ ఉందంటే ఉంది అన్నట్లుగానే అలా ఉంచేస్తున్నారు. అయితే పాత కమిటీలను రద్దు చేసిన టీడీపీ అధినాయకత్వం కొత్తగా కమిటీలు వేయకపోవడం మీద కూడా తెలంగాణా తమ్ముళ్ళు గుస్సా అవుతున్నారు. టీడీపీని జాతీయ పార్టీగా చూపించుకునేందుకే తెలంగాణాలో పార్టీ ఉందని చూపిస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట.

‘కంచం పొత్తు, మంచం పొత్తు’... క్లారిటీ ఇచ్చిన తీన్మార్ మల్లన్న!

హైదరాబాద్ పెన్ పవర్: తాజాగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆఫీసుపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. బీఆరెస్స్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పలువురు కార్యకర్తలు దాడికి దిగారు! కవిత చేస్తున్న బీసీ ఉద్యమాన్ని మల్లన్న తప్పుబడుతూ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో జరిగిన ఘటనపై మల్లన్న రియాక్ట్ అయ్యారు. అవును... తన కార్యాలయంపై జాగృతి కార్యకర్తల దాడిపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పందించారు. ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా... ఎమ్మెల్సీ కవిత, ఆమె కుటుంబం తనపై హత్యాయత్నానికి తెగబడిందని ఆరోపించారు. ‘కంచం పొత్తు, మంచం పొత్తు’ వ్యాఖ్యలపైనా వివరణ ఇచ్చారు. తాజాగా హైదరాబాద్ లో మీడియాతో ఆయన మాట్లాడారు. తన కార్యాలయంపై జరిగిన దాడిలో తన చేతికి గాయమైందని.. తన గన్ మెన్ నుంచి తుపాకీ లాక్కుని కాల్పులు జరిపేందుకు కవిత అనుచరులు యత్నించారని.. ఈ తరహా దాడులు చేసినంత మాత్రాన బీసీలు, అణగారిన వర్గాలను అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాము చేసే ప్రయత్నం ఇసుమంత కూడా తగ్గదని తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు. ఇలాంటి పనులకు తాను భయపడనని.. ఈ విషయాన్ని రాసి పెట్టుకోవచ్చని.. రానున్న మూడేళ్లలో మిమ్మల్ని రాజకీయంగా పాతాళానికి తొక్కే బాధ్యత మాది అంటూ మల్లన్న మండిపడ్డారు. ఈ సందర్భంగా... కేసీఆర్, కేటీఆర్ లపై ఉన్న ఫ్రస్ట్రేషన్ తమపై చూపిస్తామంటే కుదరదని చెప్పిన మల్లన్న... ఇలాంటి దాడులతో మరింత దిగజారి చులకన కావడం తప్ప ఇంకేమీ ఉండదన్నారు. ఈ నేపథ్యంలో కంచం పొత్తు, మంచం పొత్తు అంటే వియ్యం అందుకోవడమని.. తాను ఆ ఉద్దేశ్యంతోనే అన్నానని.. కనీస అవగాహన లేకుండా కవిత కిరాయి రౌడీలను పంపించి దాడి చేయించారని అన్నారు. తాను ఒకవేళ తలదించుకోవాల్సి వస్తే అది బీసీ బిడ్డలవద్దే కానీ.. కల్వకుంట్ల దొరల కాళ్ల దగ్గర కాదని మల్లన్న వ్యాఖ్యానించారు. అసలు.. బీసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై తాము పోరాడుతుంటే మధ్యలో కవితకు ఎందుకు బాధ? అని ప్రశ్నించిన తీన్మార్ మల్లన్న... ఉనికి కోసం అయితే కేసీఆర్ ను అడగాలని సూచించారు.

ఒక ఊరికని బయలుదేరితో మరో దేశంలో దింపిన పాక్ ఎయిర్ లైన్స్!

హైదరాబాద్ పెన్ పవర్: సాధారణంగా బస్సుల్లోనూ, రైళ్లలోనూ నిద్రపోయో, మరిచిపోయో గందరగోళానికి గురైన ప్రయాణికులు ఒక చోట దిగల్సింది పోయి మరోచోట దిగిన ఘటనలు చాలానే ఉంటాయి.. ఈ విషయంలో చాలా మందికి స్వానుభవం కూడా ఉంటుందని అంటారు. అయితే... ఇలాంటి ఘటన విమాన ప్రయాణం విషయంలో జరిగితే ఎలా ఉంటుంది? తాజాగా పాక్ ఎయిర్ లైన్స్ విషయంలో అదే జరిగింది! అవును... ఓ ఊరు వెళ్లాల్సిన ప్రయాణికుడిని, ఇంకో దేశంలోకి తీసుకెళ్లి వదిలేసింది పాక్ ఎయిర్ లైన్స్. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పాకిస్థాన్ లో లాహోర్ నుంచి కరాచీకి బయల్దేరాడు షాజహాన్ అనే వ్యక్తి. ఈ సమయంలో స్థానిక ఎయిర్ పోర్టుకు చేరుకొని, దేశీయ విమానాలు ఆగే డొమెస్టిక్ టెర్మినల్ నుంచి లోపలికి ప్రవేశించాడు. కరాచీ వెళుతుందని భావించిన ఓ విమానంలోకి ఎక్కాడు. ఆ సమయలో అతడు లోపలికి వెళుతున్నప్పుడు సిబ్బందికి టికెట్ చూపించాడం, వారు అనుమతించడం.. అతడు లోనికి వెళ్లి కూర్చోవడం అన్నీ టకటకా జరిగిపోయాయి. విమానం ప్రయాణం ప్రారంభించింది. అయితే.. లాహోర్ నుంచి దగ్గరలోనే ఉన్న కరాచీకి 1:45 సమయం పడుతుంది. కానీ.. రెండు గంటలైనా రాకపోయే సరికి అతడికి అనుమానం వచ్చింది. దీంతో.. సిబ్బందిని పిలిచి రెండుగంటలు దాటినా విమానం కరాచీకి ఎందుకు చేరలేదని ప్రశ్నించాడు. దీంతో కంగుతినడం సిబ్బంది వంతైంది. ఆ తర్వాత కాసేపటికి తేరుకొని ప్రయాణికుడిదే తప్పు అని రివర్స్ లో మొదలుపెట్టారు. ఈ సమయంలో.. కనీసం తనను తిరిగి కరాచీకి చేర్చాలని కోరినా... ఆ ప్రాసెస్ కు మూడ్రోజుల సమయం పడుతుందని చెప్పారు. అయితే.. లాహోర్ విమానాశ్రయంలో ఇంటర్నేషనల్ టెర్మినల్ కు మరమ్మతులు నిర్వహిస్తుండటంతో డొమెస్టిక్ టెర్మినల్ వద్దే వాటినీ ఉంచడంతో ఏర్పడిన గందరగోళం కారణంగానే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు. మరోవైపు మరోవైపు ఈ విషయంపై స్పందించిన పౌర విమానయాన శాఖ.. సదరు ప్రైవేటు ఎయిర్ లైన్స్ సంస్థకు భారీగా ఫైన్ విధించింది.

విమాన ప్రమాద మృత్యుంజయుడు పరిస్థితి ఇప్పుడెలా ఉందో తెలుసా?

హైదరాబాద్ పెన్ పవర్: అహ్మదాబాద్ లో జూన్ 12న జరిగిన ఎయిరిండియా విమానం ఘోర ప్రమాదం అందరినీ ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో విమానంలో ప్రయాణిస్తున్న 242 మందిలో ఒకే ఒక్క ప్రయాణికుడు విశ్వాస్ కుమార్ గాయాలతో సజీవంగా బయటపడ్డారు. దీంతో.. ఆయనను మృత్యుంజయుడు అని సంబోధిస్తున్నారు నెటిజన్లు. ఈ సమయంలో ఆయన తాజా పరిస్థితిని కుటుంబ సభ్యులు వివరించారు. అవును... అహ్మదాబాద్ విమాన ప్రమాదం నుంచి అనూహ్యరీతిలో ప్రాణాలతో బయటపడ్డారు మృత్యుంజయుడు విశ్వాస్ కుమార్. ప్రమాదం అనంతరం ఆయన నడుచుకుంటూ అంబులెన్స్ ఎక్కిన దృశ్యాలు నెట్టింట వైరల్ గా మారాయి. ఇదే సమయంలో.. ఆ విమానంలో ఆయన సీటు నెంబర్ ఏ11 కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పైగా ఇటీవల విమాన టిక్కెట్ల బుక్కింగ్స్ లో ఏ11 సీటుకు డిమాండ్ పెరిగిందని అంటున్నారు. ఆ సంగతి అలా ఉంటే... ఆ ఘోర ప్రమాదం నుంచి బయటపడి మృత్యుంజయుడిగా ఉన్నప్పటికీ.. విశ్వాస్ ఇంకా ఆ భయానక క్షణాలను మరచిపోలేకపోతున్నారని.. ఆయనను ఇప్పటికీ నాటి భయానక క్షణాలు, దృశ్యాలు వెంటాడుతూనే ఉన్నాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రధానంగా... ప్రమాద దృశ్యాలతో పాటు ఘటనలో సోదరుడిని కోల్పోవడం వంటి వాటితో విశ్వాస్ మానసికంగా తీవ్రంగా కుంగిపోయాడని తెలిపారు. ఆయన అర్ధరాత్రి సమయంలో నిద్రలోంచి హఠాత్తుగా మేల్కొంటున్నారని.. ఇక తిరిగి నిద్రపోవడం లేదని తెలిపారు. ఇదే సమయంలో.. ఇప్పట్లో మళ్లీ లండన్ కు వెళ్లే ప్రణాళికలు లేవన్నారు. ఇంట్లో వాళ్లతో కూడా సరిగా మాట్లాడటం లేదని.. ఆయన క్షేమం గురించి తెలుసుకునేందుకు విదేశాల్లో నివసిస్తున్న బంధువులు ఫోన్ లు చేస్తున్నా మాట్లాడలేకపోతున్నట్లు వెల్లడించారు. తిరిగి మామూలు మనిషిని చేసేందుకు మానసిక చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు! కాగా... బ్రిటన్ లో నివాసముంటున్న విశ్వాస్ కుమార్.. ఇటీవల గుజరాత్ లోని తన కుటుంబాన్ని కలిసేందుకు వచ్చి, తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నాడు వైరల్ అయ్యాయి. ఇదే సమయంలో... విమానం కూలిన వెంటనే అగ్నిగోళం మండుతుండగా, నల్లని పొగ అంతెత్తున చుట్టూ అలుముకోగా.. వాటి పక్కనుంచి విశ్వాస్ కుమార్ నడుచుకుంటూ వచ్చేస్తున్నారు. ఈ వీడియో మరింత సంచలనంగా మారిన సంగతి తెలిసిందే! ఈ క్రమంలో... నాడు శరీరానికి తగిలిన గాయాలు మానినా... మానసికంగా తగిలిన షాక్ నుంచి మాత్రం ఆయన ఇంకా తేరుకోలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

ఆమంచి చేరేది ఆ పార్టీ గూటికేనా ?

హైదరాబాద్ పెన్ పవర్: ప్రకాశం జిల్లాలో ఆమంచి క్రిష్ణ మోహన్ ఒక కీలక నేతగా ఉన్నారు. ఆయన రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దివంగత మాజీ సీఎం రోశయ్య శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చిన ఆమంచి క్రిష్ణ మోహన్ బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు. కాంగ్రెస్ తో సుదీర్ఘకాలం అనుబంధం ఆయనకు ఉంది. మధ్యలో తెలుగుదేశం, వైసీపీలలో కూడా ఆయన రాజకీయం చేశారు. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ లో ఉన్నారు.

షర్మిల పీసీసీ చీఫ్ అయిన తరువాత కాంగ్రెస్ లో చేరిన ఏకైన బలమైన నేత ఎవరైనా ఏపీలో ఉన్నారు అంటే అది ఆమంచి క్రిష్ణ మోహనే అని చెప్పాలి. అంతే కాదు 2024లో పోటీ చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో అత్యధిక ఓట్లు తెచ్చుకున్నదీ ఆయనే కావడం విశేషం. రీసెంట్ గా షర్మిల జిల్లా పర్యటనలో భాగంగా ఒంగోలులో కార్యకర్తల సభ పెడితే దానిని బాగా నిర్వహించిది కూడా క్రిష్ణ మోహనే. కాంగ్రెస్ లో బలమైన నేతగా ఉన్న క్రిష్ణ మోహన్ వచ్చే ఎన్నికల కోసం తీవ్రంగానే ఆలోచన చేస్తున్నారు అని అంటున్నారు. ఆయన 2029 ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ నుంచి పోటీ చేయరు అని అంతా అంటున్నారు. 2024లో అయితే వైసీపీ నుంచి బయటకు వచ్చి అప్పటికే కిటకిటలాడుతున్న కూటమి వైపు వెళ్ళలేక ఆయన కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు అని అంటారు. ఇక ఆయన ఇపుడు తన భవిష్యత్తు రాజకీయం గురించి ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. టీడీపీలో చేరేందుకు అవకాశం లేదని అంటున్నారు. దానికి కారణం చీరాల నియోజకవర్గాన్ని ఆయన కోరుకుంటారు. అక్కడ ఆ పార్టీకి సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నారు. ఇక జనసేనలో చేరవచ్చు కానీ పొత్తులో చీరాల టీడీపీకే పోతుంది అని అంటున్నారు. దాంతో ఆయనకు తాజాగా వైసీపీలో చోటు చేసుకున్న పరిణామాలు కలసి వస్తున్నాయని అంటున్నారు. చీరాల నుంచి కరణం వెంకటేష్ ని తప్పించి అద్దంకికి వైఎస్ జగన్ షిఫ్ట్ చేశారు. అద్దంకి కూడా కరణం ఫ్యామిలీకి బలమైన స్థావరం. పైగా 2024లో కరణం ఫ్యామిలీకి చీరాల టికెట్ ఇస్తే ఓటమి పాలు అయ్యారు. దాని వల్ల ఆమంచి కృష్ణమోహన్ కూడా పార్టీకి దూరం అయ్యారని పార్టీ భావిస్తోంది. ఇపుడు చీరాల వైసీపీ ఖాళీగా ఉంది. బలమైన నాయకుడు ఆ పార్టీకి కావాలని అంటున్నారు. అదే సమయంలో ఆమంచికి కూడా బలమైన పార్టీ వచ్చే ఎన్నికల కోసం కావాలని అంటున్నారు. జగన్ మీద ఆమంచికి కోపం లేదని అలాగే ఆమంచికి కూడా జగన్ విషయంలో ఏమీ ఫిర్యాదులు లేవని అంటున్నారు. దాంతో రెండు వైపుల నుంచి అవసరాలు ఆమంచిని తిరిగి వైసీపీ గూటి వైపుగా నడిపిస్తాయని అంటున్నారు. దీని కోసం సరైన ముహూర్తమే కుదరాలని అంటున్నారు. బహుశా లోకల్ బాడీ ఎలక్షన్స్ కి ముందు ఆమంచి క్రిష్ణ మోహన్ తిరిగి ఫ్యాన్ పార్టీ నీడకు చేరుకోవచ్చు అని జిల్లాలో ప్రచారం అయితే సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

జగన్ ని పొగిడిన పచ్చ చానల్...ఇదే వైరల్!

హైదరాబాద్ పెన్ పవర్: జగన్ జనం క్రేజ్ ఆయన గ్రేట్ ఇలాంటి మాటలు వైసీపీ వారు వందిమాగదులు అంటే మామూలుగా ఉంటుంది. ఆ సౌండ్ కూడా పెద్దగా ఉండదు. కానీ జగన్ అంటే పడని ఆయన పార్టీ పొడగిట్టని ఒక చానల్ వైసీపీ వారి దృష్టిలో పచ్చ చానల్ గా ముద్రపడిన ఒక మీడియా జగన్ ఏ రేంజిలో పొగిడిందో చూస్తే కనుక భూమి దద్దరిల్లిపోయేలా బిగ్ సౌండ్ వస్తుంది. అంతే కాదు టీడీపీ కూటమికి బహుశా షాక్ తినే పరిస్థితి వస్తుందేమో అంటున్నారు. మన గురించి మన వారు కాదు అవతల వారు పొగిడితే ఆ కిక్కే వేరు దానికి వచ్చే లెక్కే వేరు అని అంటారు. ఇపుడు సరిగ్గా అదే జరుగుతోంది. జగన్ గురించి ఒక పచ్చ చానల్ రాసిన తనదైన విశ్లేషణ కూటమిలో అతి పెద్ద చర్చకు దారి తీస్తూంటే వైసీపీ వర్గాలు అయితే పండుగే చేసుకుంటున్నాయి. జగన్ కి ఏముంది జస్ట్ పదకొండు సీట్లే కదా అని లైట్ తీసుకోకూడదన్నట్లుగా ఒక హెచ్చరికగా కూడా ఈ విశ్లేషణ ఉంటే ఉండొచ్చు. కానీ అందులో జగన్ ని మామూలుగా అనుకోవద్దు ఆయన వ్యూహాలు ఎత్తుగడలు వేరే లెవెల్ అని పొగడకుండానే పొగడడం చూసిన వారు మాత్రం ఏమిటి ఇది అనుకోవాల్సిందే. ఒక రాజకీయ నాయకుడిగా జగన్ ది పదిహేనేళ్ళ ప్రస్థానం. అందులో ఆయన పాదయాత్రలని మరో యాత్రలను జనం మధ్యలో 2019 దాకా తిరిగారు. ఇక ఓటమి తరువాత కేవలం ఏడాది మాత్రమే అయింది. జగన్ రోడ్ల మీదకు వస్తూంటే జనాలు పోలోమని వెంటపడడం ఏ రకమైన సంకేతం అని సదరు పచ్చ చానల్ ప్రశ్నిస్తోంది. ఒక సినీ స్టార్ కి ఉండే క్రేజ్ జగన్ కి ఉందని చెప్పకనే చెబుతోంది. అంతే కాదు అయిదేళ్ల టీడీపీ ప్రతిపక్ష పాత్రను వైసీపీతో పోల్చుతూ అబ్బే ఆ రోజులలో టీడీపీ కోలుకోవడానికి కనీసంగా మూడు నాలుగేళ్ళు పట్టిందని దెప్పిపొడుస్తోంది. పైగా 2024 ఎన్నికల వేళ కూటమి కట్టి అధికారం దక్కుతుందన్న సంకేతాలను ఇస్తూన్నా చంద్రబాబు సభలకు వచ్చిన జనాలతో పోలిస్తే ఈ రోజున తొలి ఏడాది కూటమి పాలన ముగిసిన తరువాత జగన్ సభలకు వస్తున్న జనాలే ఎక్కువ అని అంటోంది.

జగన్ భయం అనే పెట్టుబడితో అధికార కూటమిని కట్టడి చేస్తున్నారని కూడా చప్పడమూ విశేషమే. జగన్ పర్యటించే చోట్ల ఆయా జిల్లాలకు చెందిన కూటమి మంత్రులు ఎమ్మెల్యేలు ఆయన మీద విమర్శలు చేయలేకపోతున్నారు అంటే ఇది ఏ రకమైన భయం అని కూడా ప్రశ్నిస్తున్నారు. మరో వైపు చూస్తే జగన్ హయాంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ టీడీపీ నేతల మీద వేధింపులు ఉండేవని, అలా వారు బయటకు రావడానికే భయపడ్డారని కానీ ఇపుడు వైసీపీ వారు అలా లేరని మేమే మళ్ళీ అధికారంలోకి వస్తున్నామని వారు చెబుతున్న మాటలు చేస్తున్న ప్రకటనలతో కూటమిలో సైతం ఒక రకమైన భావన ఏర్పడినట్లుగా కనిపిస్తోంది అని అంటున్నారు.

జగన్ మళ్ళీ వస్తారేమో అన్న భావనతో అధికార యంత్రాంగం కూడా చురుకుగా పనిచేయడం లేదని సదరు చానల్ ఆక్షేపించింది. అంతే కాదు కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదని మెతక ప్రభుత్వం అన్న భావన జనంలోకి వెళ్తోంది అని చెబుతోంది. ఇక చంద్రబాబుకు కూటమి ప్రభుత్వం మీద పట్టు లేకుండా పోయింది అని కూడా నిశితమైన విమర్శలే చేసింది. రాష్ట్రంలో ఉన్నది కూటమి ప్రభుత్వమా లేక జగన్ ప్రభుత్వమా అన్నది టీడీపీ కార్యకర్తలే ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది అని అంటోంది. ప్రత్యర్థి పక్షాన్ని భయపెట్టడంలో జగన్ విజయవంతం అయ్యారని కూడా మెచ్చుకోలు మాటలు చెబుతోంది. యావత్తు టీడీపీకి పిరికితనం ఆవహించింది అని కూడా నిందలేస్తోంది. మరో వైపు కూటమి నాయకులు మంత్రులు ఎమ్మెల్యేలు ఎవరూ కార్యకర్తల బాధలను పట్టించుకోవడం లేదని ఘాటైన విమర్శలే చేసింది. నిజంగా జగన్ బలపడ్డారా అని కూటమి నేతలు ఆరా తీసే పరిస్థితి వచ్చిందంటే జగన్ చూపిస్తున్న భయం ఏ రేంజిలో ఉందో అర్థం చేసుకోవాలని అంటోంది. ఈ రోజున జగన్ కి వ్యతిరేకంగా ప్రకటనలు చేయడానికి కూడా ఎవరూ ముందుకు రావడం లేదని పేర్కొంటోంది. ఇక జగన్ ని నిలువరించే విషయంలో టీడీపీ కూటమి పూర్తిగా విఫలం అయింది అని కూడా విమర్శించారు. జగన్ అధికారంలో ఉన్నపుడు ఒక ఉద్యమాన్ని కూడా చేయడానికి టీడీపీ వారు భయపడితే ఇపుడు ఏడాది అయినా తిరక్కముందే మేము అధికారంలోకి వస్తే అందరికీ సినిమా చూపిస్తామన్న స్థాయిలో వైసీపీకి రావడం అంటే ఆలోచించాల్సిందే అన్నది పచ్చ చానల్ ఉవాచ. ఇలా జగన్ గురించి అన్నీ పాజిటివ్ గా రాస్తూ ఆయన పెడుతున్న భయాన్ని పిరికిగా టీడీపీ భరిస్తోందని ఆక్షేపించడం అంటే ఇది వైసీపీ శ్రేణులకు ఆనందపరచే విశ్లేషణగానే చూస్తున్నారు. దీంతో సోషల్ మీడియాలో ఎన్నడూ లేనిది పచ్చ చానల్ నుంచి వచ్చిన ఈ రాజకీయ వ్యాఖ్యానాన్ని వైసీపీ వారే పోస్టు చేస్తూ తెగ వైరల్ చేస్తున్నారు అదే సమయంలో దటీజ్ జగన్ అని వైసీపీ యూట్యూబర్లు కూడా లెక్కకు మిక్కిలిగా పోస్టులు చేసి వదులుతున్నారు. మీరు పిరికివారు అని మీ ఇంటి పత్రిక మీ నట్టించి చానలే చెప్పిందిగా అంటూ రెట్టిస్తున్నారు. ఈ మొత్తం పరిణామాల నేపథ్యంలో చూస్తే టీడీపీ కూటమికి ఈ వ్యాఖ్యానాలు ఏ మాత్రం మింగుడు పడడం లేదు అంటున్నారు అదే సమయంలో వైసీపీ ఫుల్ జోష్ లో ఉంది. ఇంతకీ ఈ రాజకీయ విశ్లేషణ రాసింది సదరు పచ్చ చానలేనా అన్నంతగా ఇది ఉందంటే తమాషా మామూలుగా లేనట్లే.

జమిలి ఎన్నికలు జరిగేనా......ఆర్ఎస్ఎస్ ప్రభావమెంత ?

హైదరాబాద్ పెన్ పవర్: దేశంలో జమిలి ఎన్నికలు అంటూ ఇటీవల కాలంలో భారీగా ప్రచారం సాగుతోంది. కేంద్రం తీసుకున్న నిర్ణయానికి సుప్రీంకోర్టు కూడా ఆమోదం తెలపడంతో ఇంకేముంది జమిలి జోరుగా వచ్చేస్తోంది అని అనుకున్నారు. ఈ నెల 21 నుంచి జరిగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో జమిలి బిల్లుని ప్రవేశపెట్టి ఆమోదించుకుంటారు అని కూడా ప్రచారం సాగింది. అయితే ఇపుడు చూస్తే ఒక్కసారిగా సీన్ మారుతోందా అన్న చర్చ సాగుతోంది. జమిలి ఎన్నికలు నిజంగా జరిగితే 2027 చివరిలో కానీ జరిగేట్టుగా లేదు. అంత టైట్ గా పొజిషన్ ఉంది. పైగా జనాభా గణన, కులగణన పూర్తి కావాలి. వాటి నివేదికలు రావాలి. ఇక పార్లమెంట్ సీట్లలో డీలిమిటేషన్ జరగాలి. ఇవన్నీ పూర్తి అయ్యేసరికి 2027 పూర్తి అవుతుందని అంటున్నారు. ఇక మిగిలింది 2028. ఒకే ఒక ఏడాది అన్న మాట. మరి ఇంతలా ఆత్రపడినా ముందస్తు ఎన్నికల కోసం తాపత్రయం తప్ప మరేమీ కాదని దానికి బదులు షెడ్యూల్ ప్రకారం 2029లో ఎన్నికలకు వెళ్తే అయిదేళ్ళ పాటు అధికారంలో ఉండొచ్చు కదా అన్న చర్చ సాగుతోందిట. మరో వైపు చూస్తే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తాజాగా జరిగిన ఒక సభలో మాట్లాడుతూ 75 ఏళ్ళు నిండిన వారు రాజకీయాల నుంచి తప్పుకుంటే మేలు అన్న మాట వాడారు. అది నేరుగా ప్రధాని మోడీకే తగులుతుందని అంటున్నారు. మరో రెండు నెలలలో ఆయన 75 ఏళ్ళు పూర్తి చేసుకోబోతున్నారు. అయితే ఆయన ఇప్పటికే ప్రధానిగా ఉన్నారు కాబట్టి మధ్యలో ఆయన తప్పుకోవడం జరగదని అంటున్నారు. ఏది జరిగినా వచ్చే ఎన్నికల తరువాతనే అని అంటున్నారు. అయితే ఆ వచ్చే ఎన్నికలు ఎంత ముందుగా వస్తే అంత ముందుగా మోడీ మాజీ ప్రధాని అవుతారా అన్న చర్చ కూడా సమాంతరంగా వస్తోంది. పైగా మోడీ పక్కకు తప్పుకుంటే ప్రధాని పీఠం ఎక్కేందుకు బీజేపీలో చాలా మంది పోటీలో ఉన్నారని ప్రచారం సాగుతోంది. ఎటూ ఆర్ఎస్ఎస్ మనసులో మాట ఏంటో తెలిసింది కాబట్టి చాలా మంది బాహాటం అవుతారని కూడా అంటున్నారు. దాంతో జమిలి ఎన్నికలు అని ఏణ్ణర్థం ముందే పదవిని మోడీ వదిలేసుకుంటారా లేక 2029లో షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు పెట్టి మంచి మెజారిటీతో గెలిచి మరో సారి తానే పీఎం గా ఉంటారా అన్నదే ఇపుడు చర్చగా ఉందిట. ఏది ఏమైనా జమిలి ఎన్నికలు జరుగుతాయా లేదా అన్నది ఒక చర్చ. దాని మీద సాధ్యాసాధ్యాల గురించే అంతా ఆలోచిస్తున్న క్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ వ్యాఖ్యల ప్రభావం కూడా పడుతోంది అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో ఈ ప్రచారాలలో నిజాలు ఏమిటో.

కోహ్లీలా నటించడం మానుకో.. గిల్‌పై ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ విమర్శలు

హైదరాబాద్ పెన్ పవర్: టీమిండియా కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ మూడో రోజు గ్రౌండ్ లో చేసిన పనిపై ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ జోనాథన్ ట్రాట్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. అతను గిల్ దూకుడు శైలిని విరాట్ కోహ్లీ శైలితో పోల్చాడు. లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడో టెస్ట్ లో మూడో రోజు ఆట చివర్లో హై డ్రామా చోటు చేసుకుంది. శనివారం (జూలై 12) ఆట ముగియడానికి 10 నిమిషాలు మిగిలి ఉన్న దశలో జస్ప్రీత్ బుమ్రా తొలి ఓవర్ వేయడానికి వచ్చాడు. ఈ ఓవర్ మూడో బంతిని ఎదుర్కొనే ముందు జాక్ క్రాలీ పదే పదే బుమ్రా బౌలింగ్ ఆడకుండా పక్కకి వెళ్ళిపోయాడు. దీంతో టీమిండియా ప్లేయర్స్ అసహనానికి గురయ్యారు.

కెప్టెన్ శుభమాన్ గిల్ ఇంగ్లాండ్ కావాలనే సమయం వృధా చేస్తుందని భావించాడు. ఇంగ్లాండ్ ఓపెనర్ క్రాలీ దగ్గరకు వెళ్లి వేలు చూపిస్తూ మాట్లాడాడు. గిల్ చేసిన పని ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ జోనాథన్ ట్రాట్ కు నచ్చలేదు. టీమిండియాపై కెప్టెన్ పై విమర్శలు గుప్పించాడు. ట్రాట్ జియోహాట్‌స్టార్‌లో మాట్లాడుతూ.. "శుబ్‌మాన్ గిల్ నటన నాకు నచ్చలేదు. కెప్టెన్‌గా మీరు టోన్ పెద్దది చేసి మాట్లాడారు. మీరు ఒక కెప్టెన్ గా ప్రత్యర్థి ప్లేయర్ పై వేలు చూపించి మాట్లాడడం మునుపటి కెప్టెన్ ను గుర్తు చేస్తుంది. పోటీతత్వం టెస్ట్ క్రికెట్‌లో భాగమే అయినప్పటికీ, దానికి ఒక పరిమితి ఉంటుంది". అని ఈ ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ గిల్ పై తన అసహనాన్ని వ్యక్తం చేశాడు.

145/3 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఆట కొనసాగించిన ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 119.2 ఓవర్లలో 387 రన్స్‌కే ఆలౌటైంది. తర్వాత రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఇంగ్లండ్ ఆట ముగిసే టైమ్‌కు 1 ఓవర్ ఆడి 2/0 స్కోరు చేసింది. క్రాలీ (2 బ్యాటింగ్), డకెట్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. నాలుగో రోజు ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ రెండు వికెట్లు కోల్పోయింది. బెన్ డకెట్, పోప్ స్వల్ప స్కోర్లకే పెవిలియన్ కు చేరారు. ఈ రెండు వికెట్లను సిరాజ్ తీసుకున్నాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ 13 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 48 పరుగులుచేసింది. క్రీజ్ లో క్రాలీ (22), రూట్ (1) ఉన్నారు.

కెప్టెన్ వికెట్ అంటే ఇది: నితీష్‌తో గిల్ సూపర్ ప్లాన్ అదుర్స్

హైదరాబాద్ పెన్ పవర్: ఇంగ్లాండ్ తో జరుగుతున్న మూడో టెస్టులో టీమిండియా పట్టు సంపాదించింది. నాలుగో రోజు ఆటలో భాగంగా చక చక మూడు వికెట్లు పడగొట్టి ఇంగ్లాండ్ ను కష్టాల్లోకి నెట్టింది. నాలుగో రోజు నితీష్ కుమార్ రెడ్డి తీసిన వికెట్ హైలెట్ గా మారుతుంది. గిల్ కెప్టెన్సీ, నితీష్ సూపర్ బాల్ కారణంగా ఈ వికెట్ వచ్చింది. ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ లో గిల్ ఆశ్చర్యకరంగా ఆకాష్ దీప్ కంటే నితీష్ ను ముందుగా బౌలింగ్ కు తీసుకొచ్చాడు. అంతేకాదు వికెట్ కీపర్ ను ముందుకు తీసుకొని వచ్చి నితీష్ చేత బౌలింగ్ చేయించాడు. గిల్ చేసిన ఈ ప్రయోగం ఫలించింది. 15 ఓవర్ ఐదో బంతికి నితీష్ రెడ్డి బాల్ ను ఆడబోయిన క్రాలీ (22) గాలిలో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఈ సిరీస్‌లో కొన్ని క్యాచ్‌లను వదిలివేసిన జైస్వాల్.. ఈ సారి ఎలాంటి తప్పు చేయకుండా అద్భుతమైన క్యాచ్ అందుకున్నాడు. క్రాలీని ఒత్తిడిలో పడేసిన గిల్.. చివరకు వికెట్ తీసి సక్సెస్ అయ్యాడు. దీంతో ఇంగ్లాండ్ 50 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయింది. వికెట్ నష్టపోకుండా 2 పరుగులతో నాలుగో రోజు ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ అంతకముందు బెన్ డకెట్, పోప్ వికెట్లను కోల్పోయింది. ఈ రెండు వికెట్లను సిరాజ్ తీసుకున్నాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ 19 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 61 పరుగులుచేసింది. క్రీజ్ లో బ్రూక్ (5), రూట్ (11) ఉన్నారు. భారత బౌలర్లలో సిరాజ్ రెండు నితీష్ కుమార్ తలో వికెట్ తీసుకున్నారు. తొలి ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ 387 పరుగులు చేయగా.. ఆతర్వాత ఇండియా కూడా సరిగ్గా 387 పరుగులు చేసింది.

ఆటను ఆస్వాదించా.. పంత్‌లా షాట్లు కొట్టాలనుంది: కేఎల్ రాహుల్

హైదరాబాద్ పెన్ పవర్: లార్డ్స్ మైదానంలో సెంచరీ చేయడమనేది ప్రతి క్రికెటర్ కల. భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (%ఖూ ఞుష్ట్రబశ్రీ%) ఈ స్టేడియంలో రెండు సెంచరీలు నమోదు చేయడం విశేషం. దిలీప్ వెంగ్‌సర్కార్ (3) తర్వాత ఎక్కువ సెంచరీలు చేసిన టీమ్‌ఇండియా బ్యాటర్‌గా కేఎల్ నిలిచాడు. చివరిగా 2021లో శతకం బాదాడు. ఇప్పుడు ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో కేఎల్ రాహుల్ (100) సెంచరీ చేసి జట్టును ఆదుకున్నాడు. ఈ సందర్భంగా 'ఆనర్స్' బోర్డులో తన పేరును మరోసారి లిఖించుకున్నాడు. అయితే, తాను రిషభ్ పంత్‌తో బ్యాటింగ్ చేయడాన్ని బాగా ఆస్వాదించినట్లు కేఎల్ వెల్లడించాడు. ఎలాగైనా అతడిలా షాట్లు కొట్టాలని ఉందని మనసులో మాట బయటపెట్టాడు. పంత్‌తో కలిసి నాలుగో వికెట్‌కు కేఎల్ 141 పరుగులు జోడించాడు. "మా ఇద్దరిలో కొన్ని సారూప్యతలు ఉన్నాయి. ఆట పట్ల ప్రేమ ఉంది. బ్యాటింగ్ చేయడం మా ఇద్దరికి చాలా ఇష్టం. క్లిష్ట సమయాల్లో నాణ్యమైన ప్రదర్శన చేయాలని భావిస్తాం. గత కొన్నేళ్లుగా పంత్‌తో కలిసి విలువైన భాగస్వామ్యాలను నమోదు చేశా. అతడితో బ్యాటింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తా. పంత్ ఆడుతున్నప్పుడు ఎలా బ్యాటింగ్ చేస్తున్నాడో నిశితంగా గమనిస్తూ ఉంటా. నేను కూడా అలా ఆడాలని కోరుకుంటా. మ్యాచులు లేనప్పుడు అలాంటి షాట్లను కొట్టాలని కలలు కంటా. క్రికెట్ గురించి మేమిద్దరం చాలా విషయాలు మాట్లాడుకుంటూనే ఉంటాం" అని కేఎల్ వెల్లడించాడు. టెస్టుల్లో రిషభ్ పంత్ తనదైన శైలిలో హిట్టింగ్ చేస్తాడు. అతడి డిఫెన్స్‌ను ఛేదించడం కూడా ప్రత్యర్థి బౌలర్లకు చాలా కష్టమే. ఎప్పుడు అగ్రెసివ్‌గా ఆడతాడో అంచనా వేయలేరు.

"పంత్ రనౌట్ కావడం బాధించింది. అంతకుముందే మేమిద్దరం మాట్లాడుకున్నాం. లంచ్ బ్రేక్ లోపే సెంచరీ పూర్తి చేస్తానని చెప్పా. బషీర్ బౌలింగ్‌లో షాట్ కొట్టా. అది ఫీల్డర్ దగ్గరకే వెళ్లింది. ఆ తర్వాత సింగిల్ తీసి ఇచ్చా. అయితే, స్ట్రైక్‌ను రొటేట్ చేసే ఉద్దేశంతో పంత్ పరుగు ప్రయత్నించాడు. అనూహ్యంగా రనౌట్ రూపంలో పెవిలియన్ చేరాడు. ఇది మా ఇద్దరికి తీవ్ర నిరుత్సాహం మిగిల్చింది. అయితే, ఎవరూ కావాలనే వికెట్‌ను సమర్పించాలని అనుకోరు" అని కేఎల్ అన్నాడు.

క్రాలీ విషయంలో..

"మైదానంలో జరిగిందంటే ఆటలో భాగమే. ఓపెనింగ్ బ్యాటర్ల కోణంలో నేను విషయాన్ని అర్థం చేసుకోగలను. నాకు తెలుసు.. అలాగే అక్కడ జరిగిందేంటో ప్రతి ఒక్కరికీ తెలుసు. క్రాలీ నాలుగో రోజు ఉదయం బాగానే ఆడతాడని అనుకుంటున్నా" అని కేఎల్ పేర్కొన్నాడు. మూడో రోజు ఆట చివర్లో క్రాలీ సమయం వృథా చేయడంపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే.

సీనియర్ల దారిలోనే రష్మిక?

నటాసా స్టాంకోవిక్ క్యాజువల్ డెనిమ్ స్టైల్‌లో మెరిసింది

అనుక్రీతి వాస్ అద్భుతమైన రెడ్ బ్లేజర్ లుక్‌లో మెరుస్తోంది

కిరిక్ పార్టీతో కెరీర్ ను స్టార్ట్ చేసిన రష్మిక ఆ తర్వాత ఛలో సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చారు. మొదటి సినిమాతోనే హిట్ అందుకున్న రష్మిక గీతా గోవిందం సినిమా తర్వాత స్టార్ హీరోలందరితో సినిమాలు చేసి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా మారారు. కన్నడ నటిగా జర్నీని మొదలుపెట్టిన రష్మిక ఇప్పుడు నేషనల్ క్రష్ గా ఓ వెలుగు వెలుగుతున్నారు.కేవలం తెలుగులోనే కాకుండా తమిళ, హిందీ భాషల్లో కూడా సినిమాలు చేసి అన్ని భాషల్లోనూ తన సత్తా చాటుతున్న రష్మిక గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ క్రేజీ వార్త వినిపిస్తోంది. అల్లు అర్జున్- అట్లీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సినిమాలో రష్మిక నటిస్తున్నారని అంటున్నారు. అయితే ఇదేమీ క్రేజీ న్యూస్ కాదు, రష్మిక ఆ సినిమాలో నెగిటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్ లో కనిపించనున్నారని వార్తలొస్తున్నాయి.ఆల్రెడీ దాని కోసం లాస్ ఏంజెల్స్ లో లుక్ టెస్ట్ కూడా పూర్తవడంతో అల్లు అర్జున్ అట్లీ ప్రాజెక్టులో రష్మిక భాగం కావడం కన్ఫర్మ్ అని అందరూ భావిస్తున్నారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి ఛాలెంజెస్ ను స్వీకరిస్తూ వస్తున్న రష్మిక ఈసారి చాలా పెద్ద డెసిషనే తీసుకున్నారు. రష్మిక కెరీర్ మొదటి నుంచి కూడా కథ విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చారు.అయితే తన పాత్రకు ప్రాధాన్యం ఉండటంతో పాటూ, కమర్షియల్ సినిమాల్లో డ్యాన్సులు, స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆడియన్స్ ను ఆకట్టుకోవడం లాంటివి చేసిన రష్మిక పుష్ప, ఛావా, యానిమల్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద మంచి మార్కెట్ ను పెంచుకున్నారు. అయితే రష్మికను అందరి హీరోయిన్ల నుంచి భిన్నంగా ఉంచింది మాత్రం ఆమె స్క్రిప్ట్ సెలక్షనే. రష్మిక నచ్చనివాళ్లు ఆమెను ట్రోల్ చేసినా ఆమె మాత్రం ఎప్పటికప్పుడు తాను నటించిన సినిమాలతో ఆడియన్స్ కు హిట్స్ అందిస్తూనే ఉన్నారు.

ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రష్మిక హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలు కూడా చేస్తున్నారు. ఒకప్పుడు సౌందర్య, మీనా, రమ్యకృష్ణ లాంటి హీరోయిన్లు ఓ వైపు గ్లామర్ హీరోయిన్లుగా నటిస్తూనే మరోవైపు నెగిటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్లు చేసి ఆడియన్స్ ను ఆకట్టుకున్నట్టు ఇప్పుడు రష్మిక కూడా వారి దారిలోనే వెళ్తూ కొత్తగా ట్రై చేయాలని చూస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతానికైతే ఈ విషయంలో ఎలాంటి అధికారిక ప్రకటన వచ్చింది లేదు. కానీ ఒకవేళ రష్మిక అల్లు అర్జున్ అట్లీ మూవీ చేస్తే మాత్రం ఆ సినిమా తర్వాత రష్మిక కెరీర్ కు ఇక ఇప్పట్లో తిరుగనేదే ఉండదు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com